


విశాల భారతి
19-03-2026
తెలుగు దినపత్రిక
www.vishalabharati.com
epaper.vishalabharati.com
గురువారం, హైదరాబాద్
సంపుటి:4 సంచిక: 74

# మళ్లీ బరాబర్ తొక్కుకుంటూ వస్తా

## 2034 వరకు కాంగ్రెసే అధికారంలో ఉంటుందని సవాల్

- బీఆర్ఎస్ తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపాటు
- తెలంగాణ అభివృద్ధికి మూడు అంచెల వ్యూహ ప్రణాళిక
- ఇప్పటికే 5 హామీలు అమలు చేశామని వెల్లడి
- ఆడబిడ్డలను కించపరిచే రాజకీయాలను తీవ్రంగా ఖండన
- నగరాభివృద్ధి కోసం మూసీ ప్రాజెక్టుపై వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. శాసనసభ వేదికగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. రాబోయే పదేళ్ల కాలం అంటే 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ జెండానే ఎగురుతుందని, ప్రజాక్షేత్రంలో తమను అడ్డుకోవడం ఎవరి తరము కాదని ఆయన అత్యంత ధీమాగా ప్రకటించారు. ముఖ్యంగా 2029 ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ, అప్పుడు కూడా ప్రత్యర్థులను బరాబర్ తొక్కుకుంటూ మళ్లీ అధికార పీఠాన్ని అధిరోహిస్తానని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి, తాను వారసత్వ రాజకీయాల ద్వారా రాలేదని, క్షేత్రస్థాయి నుంచి కష్టపడి ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చానని భావోద్వేగంతో ప్రసంగించారు. సభలో చర్చ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరుపై రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో రాజులు పోయినా, రాజ్యాలు అంతరించినా కొందరిలో ఇంకా రాచరిక పోకడలు పోలేదని ఆయన ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కనీస ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని కూడా ప్రధాన ప్రతిపక్షం గౌరవించకపోవడం శోచనీయమని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం తెలంగాణ సంస్కృతికి ఎంత మాత్రం తగదని ఆయన హెచ్చరించారు. నూతన గవర్నర్‌ను కలవడానికి కూడా ప్రతిపక్ష నేత రాకపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ముఖ్యమంత్రి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏ అహంకారంతో అయితే ప్రజలను విస్మరించారో, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత కూడా అదే ధోరణిని ప్రదర్శించడం విడ్డూరంగా ఉందని ముఖ్యమంత్రి మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన నాయకులని, వారు ఇచ్చిన తీర్పును గౌరవించలేని వారు

మిగతా 3లో..

# తెలంగాణలో 2029లోనే ఎన్నికలు

- డ్రగ్స్ కేసులో ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదు - సీఎం
- డిలిమిటేషన్ ప్రక్రియ, తెలంగాణ 2029 అసెంబ్లీ ఎన్నికలు
- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన కీలక వ్యాఖ్యలు
- మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు, సిట్ దర్యాప్తు
- డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంగా ఈగల్ టీమ్ వ్యవస్థ
- మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చే ప్రణాళిక
- గత ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ సరఫరా లోపాలపై విమర్శలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో ఇప్పుడు "ముందస్తు" ముచ్చట కంటే "జమిలి" చర్చలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. జాతీయ స్థాయిలో జరుగుతున్న డీలిమిటేషన్ ప్రక్రియ, దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం 2028లో జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికలు కాస్త అటు ఇటుగా మారి, నేరుగా 2029లోనే జమిలి ఎన్నికల రూపంలో వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడటం గమనార్హం.

మిగతా 2లో..



# యుద్ధంతో ఆకలి కేకలు

- యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆకలి కేకలు రికార్డు స్థాయికి
- చమురు ధరలు పెరిగి నిత్యావసరాలు సామాన్యుడికి భారం
- అదనంగా 4.5 కోట్ల మంది ఆకలి కోరల్లోకి వెళ్లే ముప్పు
- ఎరువుల సరఫరా ఆగి వ్యవసాయ రంగం సంక్షోభంలోకి
- ఆకలి తీర్చే అంతర్జాతీయ నిధులు 40శాతం తగ్గడం ఆందోళనకరం
- సహాయక చర్యల కోసం తక్షణమే రూ. 711 కోట్లు అవసరం

03



# అభివృద్ధి బాట.. కోమటిరెడ్డి మాట!

- 2028 నాటికి దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ రోడ్ల వ్యవస్థ
- హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో సరికొత్త రహదారుల నిర్మాణం
- తెలంగాణ చరిత్రలోనే రికార్డు స్థాయి రూ. 30 వేల కోట్ల రోడ్ల టెండర్లు
- ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఏప్రిల్ 10 లోపు రోడ్ల నిర్మాణ అగ్రిమెంట్స్ పూర్తి: మంత్రి కోమటిరెడ్డి
- రోడ్లు అంటే తెలంగాణ అనే బ్రాండ్ ఇమేజ్ తెస్తామన్న వెంకట్ రెడ్డి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తరహాలో తెలంగాణ రహదారుల అభివృద్ధి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ శాసనసభ వేదికగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిపై కీలక ప్రకటన చేశారు. 2028 జూన్ నాటికి తెలంగాణను దేశానికే రోడ్ల విషయంలో రోల్ మోడల్‌గా నిలబెడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో సరికొత్త రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. ఈ పద్ధతి ద్వారా నిధుల కొరత లేకుండా, నాణ్యమైన రోడ్లను వేగంగా నిర్మించే అవకాశం ఉంటుందని ఆయన సభకు తెలిపారు. ప్రతి గ్రామానికి సరైన రహదారి సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు హరీశ్ రావు, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. నిజమైన అభివృద్ధి అనేది ప్రతి పౌరుడి నివాసానికి రోడ్డు సౌకర్యం ఉన్నప్పుడే సాధ్యమవుతుందని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు బీటీ రోడ్లు, అక్కడి నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు నిర్మించడం ద్వారా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. ఇందుకోసం ఏ రాష్ట్రంలో లేని విధంగా సుమారు 30 వేల కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచామని, ఇది రాష్ట్ర చరిత్రలో ఒక రికార్డు అని ఆయన పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెక్నికల్ బిడ్స్ ఓపెన్ చేశామని, ఏప్రిల్ 10 లోపు అగ్రిమెంట్స్ ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. పనులు ప్రారంభమైన తర్వాత శరవేగంగా పూర్తి చేసి, 2028 నాటికి "రోడ్లు అంటే తెలంగాణ" అనే బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని చెప్పారు.

మిగతా 2లో..

# 700 మంది రైతులు చనిపోయారు

- అబద్ధాల డిక్లరేషన్ అని, హామీల అమలుపై స్పష్టత లేదని విమర్శ
- ఎన్నికల మేనిఫెస్టోలోని '420 హామీల' ఊసే లేదని మండిపాటు
- కాంగ్రెస్ హయాంలో 700 మంది రైతులు చనిపోయారని ఆరోపణ
- రాష్ట్రం రూ.10 వేల కోట్ల రెవెన్యూ లోటులో ఉందని వెల్లడి
- తెలంగాణకు కేంద్రం రూ.13 లక్షల కోట్లు ఇచ్చిందని స్పష్టీకరణ
- ప్రజా సమస్యల చర్చకు అసెంబ్లీని 30 రోజులు నడపాలని డిమాండ్

02



# హర్మూజ్ వద్ద అమెరికా భీకర దాడులు

- ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా 'బంకర్ బస్టర్' దాడులు
- హర్మూజ్ మార్గంలో ఇరాన్ ఆధిపత్యానికి అమెరికా బ్రేక్
- ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాపై ఇజ్రాయెల్ గురి
- లెబనాన్‌లోని హెజ్బొల్లా కేంద్రాలను ధ్వంసం చేసిన ఐడీఎఫ్
- యూఏఈ, కువైట్, బహ్రెయిన్ దేశాల్లో హై అలర్ట్
- పశ్చిమాసియాకు వేగంగా వస్తున్న 'యూఎస్ఎస్ ట్రిపోలి'

02

# ఇస్మాయిల్ ఖాతిబ్ హత్య

- ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలు, ఉద్రిక్తతలు
- ఇస్మాయిల్ ఖాతిబ్ హత్య - ఇరాన్ రక్షణ కవచంపై ఇజ్రాయెల్ దెబ్బ
- ఇరాన్ అధ్యక్ష భవనంపై ఇజ్రాయెల్-అమెరికా సంయుక్త దాడులు
- మొజ్తాబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపై కొనసాగుతున్న సస్పెన్స్
- అలీ లారిజానీ మరణం - ఇరాన్ సైనిక యంత్రాంగంపై ప్రభావం



03

# సభలో మూసీ సెగ

- తెలంగాణ శాసనసభలో మూసీ పునరుజ్జీవంపై వాడివేడి చర్చ
- మూసీ ప్రక్షాళనపై కేటీఆర్, మంత్రుల మధ్య మాటల యుద్ధం
- లక్షన్నర కోట్ల దోపిడీకి వ్యతిరేకం.. మూసీ ప్రక్షాళనకు కాదు
- మూసీ ప్రాజెక్టు డీపీఆర్ పై ప్రభుత్వం , ఎండీ మధ్య వైరుధ్యం
- మూసీ తీరాన పేదల ఇళ్ల కూల్చివేత, నోటీసులపై బీఆర్ఎస్ నిరసన
- మూసీ పరివాహక ప్రాంత బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల హామీ
- ప్రక్షాళన అడ్డుకుంటున్నారన్న మంత్రుల ఆరోపణలపై కేటీఆర్ కౌంటర్

03






# శుభాది.. ఉగాది..!

- శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ విశిష్టత
- ఉగాది పచ్చడిలోని షడ్రుచుల అంతరార్థం, ప్రాముఖ్యత
- తెలుగు వారి మొదటి పండుగ ఉగాది సాంప్రదాయాలు
- వసంత రుతువులో ప్రకృతి మార్పులు, ఉగాది ఆగమనం
- బ్రహ్మ దేవుడు సృష్టిని ప్రారంభించిన చైత్ర శుద్ధ పాడ్యమి కథ
- ఉగాది రోజున పంచాంగ శ్రవణం ఎందుకు చేయాలి
- శ్రీకృష్ణుడు చెప్పిన స్థితప్రజ్ఞతకు నిదర్శనం ఉగాది పచ్చడి




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వచ్చేది 'పరాభవ' నామ సంవత్సరమే అయినా, పేరులోని అర్థాన్ని చూసి భయపడాల్సిన అవసరం లేదని మన సంస్కృతి చెబుతోంది. కాలచక్రంలో అరవై ఏళ్లు ఒకదాని తర్వాత ఒకటి తిరుగుతూనే ఉంటాయి. ప్రభవతో మొదలై అక్షయతో ముగిసే ఈ ప్రయాణంలో గెలుపోటములు సహజం. నిజానికి పరాభవం అంటే కేవలం అవమానం అని మాత్రమే కాదు, పాత ఆలోచనలను ఓడించి కొత్త ఉత్సాహంతో ముందుకు సాగడమని కూడా అర్థం చేసుకోవచ్చు. ఉగాది పచ్చడిలో ఉండే తీపి, వగరు, చేదుల కలయిక మనకు నేర్పే పాఠం కూడా ఇదే. జీవితంలో ఏది ఎదురైనా ఆత్మవిశ్వాసంతో స్వీకరించడమే అసలైన వికాసం. మనిషి మేధస్సు పెరిగే కొద్దీ సృష్టికి మూలం ఏమిటి, అసలు ఈ కాలం ఎలా సాగుతోంది అనే ప్రశ్నలు ఉదయించాయి. ఆ జిజ్ఞాస నుంచే మన పూర్వీకులు ఖగోళ విజ్ఞానాన్ని, గణితాన్ని జోడించి కాలగణనను రూపొందించారు. భగవంతుడే కాల స్వరూపుడని నమ్మే మనకు, ఉగాది అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది ఒక కొత్త అధ్యాయానికి నాంది. బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించిన రోజుగా, విష్ణుమూర్తి మత్స్య అవతారం దాల్చిన తిథిగా పురాణాలు చైత్ర శుద్ధ పాడ్యమిని కీర్తిస్తున్నాయి. అందుకే ఇది భారతీయులందరికీ అత్యంత ప్రాచీనమైన, వైజ్ఞానికమైన పండుగగా నిలిచిపోయింది.

మనం ప్రస్తుతం శ్వేతవరాహ కల్పంలో, వైవస్వత మన్వంతరంలో ఉన్నామని సంకల్పం చెప్పుకుంటాం. అనంతమైన ఈ విశ్వంలో మన ఉనికి ఎంత చిన్నదో గుర్తుచేసుకోవడమే ఇందులోని ప్రధాన ఉద్దేశ్యం. సత్య, త్రేతా, ద్వాపర యుగాల తర్వాత ఇప్పుడు మనం కలియుగంలో ఉన్నాం. ఈ కాల గణన అంతా సౌర, చంద్ర గమనాల ఆధారంగా జరుగుతుంది. ప్రకృతిలో వచ్చే మార్పులను గమనిస్తూ, చెట్లు చిగురించి కోకిలలు గానం చేసే వసంత రుతువులో ఈ పండుగ రావడం వెనుక ఒక గొప్ప ఆరోగ్య రహస్యం కూడా దాగి ఉంది. కొత్త చిగుళ్లు ఎలాగైతే పాత ఆకులను వదిలేస్తాయో, మనం కూడా పాత బాధలను వదిలేయాలి.

తెలుగు సంవత్సరాల పేర్ల వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. నారద మహర్షి సంతానమే ఈ అరవై ఏళ్ల పేర్లని పురాణాలు చెబుతున్నాయి. అయితే కొన్ని పేర్లు శుభప్రదంగా, మరికొన్ని భయంకరంగా అనిపించవచ్చు. ఉదాహరణకు 'విరోధి' నామ సంవత్సరంలోనే భారతదేశం గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించింది. అలాగే 'శుభకృతు' ఏడాదే యుద్ధాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. కాబట్టి పేరులోని అర్థం కంటే మన చేసే కర్మలే ఫలితాలను నిర్ణయిస్తాయని గ్రహించాలి. ప్రతికూల అర్థం ఉన్న పేర్లను ఒక హెచ్చరికగా భావించి, మన లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తే ఏ ఏడాది అయినా మనకు విజయాలనే అందిస్తుంది. శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్టు సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించే వాడే స్థితప్రజ్ఞుడు. ఉగాది పచ్చడి మనకు ఈ జీవన తత్వాన్ని రుచి ద్వారా పరిచయం చేస్తుంది. బెల్లం తీపిని, వేపపువ్వు చేదును, చింతపండు పులుపును ఎలాగైతే కలిపి ఆస్వాదిస్తామో, జీవితంలో వచ్చే లాభనష్టాలను కూడా అలాగే స్వీకరించాలి. ఈ ఏడాది మనల్ని పలకరిస్తున్న పరాభవ సంవత్సరం కూడా మనలోని అహంకారాన్ని, దుర్గుణాలను పరాభవం చేసి, ఉత్తమ సంస్కారాన్ని మనకు అందిస్తుందని ఆశిద్దాం. ప్రకృతి వైపరీత్యాల నుంచి, మానసిక ఆందోళనల నుంచి విముక్తి పొందాలని కోరుకుంటూ లోక కల్యాణం కోసం ప్రార్థించడం మన బాధ్యత.

చరిత్రలో యుగపురుషులుగా నిలిచిన విక్రమాదిత్యుడు, శాలివాహనుడు వంటి వారు తమ పరాక్రమంతో కొత్త శకాలను ప్రారంభించారు. ఉత్తర భారతాన్ని విక్రమ శకం, దక్షిణ భారతాన్ని శాలివాహన శకం ఏలుతున్నాయి. ముఖ్యంగా శాలివాహనుడు ఒక కుమ్మరి ఇంలో పెరుగుతూ, తన మేధస్సుతో విక్రమాదిత్యుడినే మెప్పించిన తీరు స్ఫూర్తిదాయకం. మట్టి బొమ్మలకు ప్రాణం పోసి యుద్ధం చేసిన ఆ కథ వెనుక ఉన్న అంతరార్థం ఏమిటంటే, సామాన్యుడు కూడా తలచుకుంటే అసాధారణ విజయాలు సాధించగలడని. ఉగాది రోజున ఇలాంటి వీరుల చరిత్రను స్మరించుకోవడం మనలో ధైర్యాన్ని నింపుతుంది. ఉగాది నాడు నిర్వహించే పనులు కేవలం ఆచారాలు మాత్రమే కాదు, వాటిలో సామాజిక బాధ్యత కూడా ఉంది. ఇళ్లపై ధ్వజారోహణం చేయడం ద్వారా మనం ధర్మాన్ని పాటిస్తున్నామని చాటిచెబుతాం. తైలాభ్యంగన స్నానం మన శరీరంలోని నాడీ వ్యవస్థను చైతన్యవంతం చేస్తుంది. కొత్త బట్టలు కట్టుకోవడం అంటే పాత ఆలోచనలను వదిలి నూతన ఉత్సాహాన్ని ధరించడమే. ముఖ్యంగా ఎండలు ముదురుతున్న సమయంలో 'చలివేంద్రాలు' ప్రారంభించడం అనేది గొప్ప మానవత్వం. ఆకలితో ఉన్నవారికి అన్నం, దాహంతో ఉన్నవారికి నీరు అందించడమే నిజమైన దైవపూజ అని మన సంస్కృతి మనకు గుర్తుచేస్తోంది.

పంచాంగ శ్రవణం అనేది రాబోయే కాలానికి ఒక దిక్సూచి లాంటిది. ఆదాయ వ్యయాల గురించి తెలుసుకోవడం అంటే డబ్బుపై వ్యామోహం పెంచుకోవడం కాదు, ఆర్థిక క్రమశిక్షణతో ఉండాలని అర్థం. రాజపూజ్యం, అవమానం వంటివి మన ప్రవర్తనను సరిదిద్దుకోవడానికి సూచనలు మాత్రమే. జ్యోతిష్యం భయపెట్టడానికి కాదు, మనల్ని అప్రమత్తం చేయడానికి ఉపయోగపడాలి. ఈ ఏడాది గ్రహాల స్థితిగతులను బట్టి పాలకులకు ప్రజా సంక్షేమంపై దృష్టి పెరుగుతుందని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని పంచాంగ కర్తలు చెబుతున్నారు. ఇది రైతులకు, సామాన్యులకు ఎంతో ఊరటనిచ్చే అంశం. ప్రకృతి కూడా ఉగాదిని ఎంతో ఇష్టపడుతుంది. చెట్లు పూత పూయడం, మామిడి కాయలు కాయడం, కోయిల పాటలు పాడటం ఇవన్నీ వసంత ఆగమనానికి సంకేతాలు. వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే 'ఏరువాక' కూడా చాలా చోట్ల ఈ రోజే జరుగుతుంది. నాగలిని పూజించి భూమిని దున్నడం ద్వారా రైతు తన జీవన యాత్రను మళ్లీ ప్రారంభిస్తాడు. నవదంపతులకు, ప్రేమికులకు చైత్ర మాసం ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది. కుటుంబ సభ్యులందరూ కలిసి విందు భోజనాలు చేస్తూ, బంధుమిత్రులకు శుభాకాంక్షలు చెప్పుకోవడం వల్ల సామాజిక సంబంధాలు బలపడతాయి. ప్రేమలు చిగురించే ఈ కాలంలో ద్వేషాలకు తావుండకూడదు. ఈ ఏడాది పంచాంగం ప్రకారం శని ప్రభావం కొంత ఉన్నా, గురువు అనుగ్రహం వల్ల సామాన్యులకు మేలు జరుగుతుంది. పట్టణ ప్రాంతాల్లో శాంతిభద్రతల విషయంలో కొంత జాగ్రత్తగా ఉండాలని సూచనలు ఉన్నాయి. బంగారం ధరలు పెరిగే అవకాశం ఉన్నందున ఆర్థిక ప్రణాళికలు జాగ్రత్తగా వేసుకోవాలి. వరదలు, తుపానుల భయం తక్కువగా ఉంటుందని అంచనా వేయడం మనకు కొంత ఊరటనిస్తుంది. ఏదేమైనా కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు, మన ఆత్మవిశ్వాసమే మనల్ని ముందుకు నడిపిస్తుంది. దైవబలం తోడైతే ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించి విజయం సాధించవచ్చని ఈ ఏడాది గ్రహగతులు మనకు భరోసా ఇస్తున్నాయి చైత్ర మాసంలో జరిగే ఉత్సవాలు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినవి. ఉగాదితో మొదలయ్యే వసంత నవరాత్రులు, శ్రీరామనవమి వరకు సాగుతాయి. సీతారాముల కల్యాణాన్ని కనులారా వీక్షించడం మన తెలుగువారికి ఒక అపురూప ఘట్టం. అలాగే గౌరీ వ్రతం, చిత్రగుప్త వ్రతం వంటివి మనలోని భక్తిని పెంచుతాయి. ప్రతి తిథి వెనుక ఒక కథ, ఒక సందేశం దాగి ఉంటుంది. ఈ వేడుకలన్నీ మనకు క్రమశిక్షణను, భక్తిని, సామాజిక స్పృహను నేర్పుతాయి. పండుగ అంటే కేవలం సెలవు దినం కాదు, మన మూలాలను వెతుక్కుంటూ వెళ్లే ఒక ప్రయాణం. ఉగాది పచ్చడిలోని షడ్రుచుల లాగే ఈ పరాభవ సంవత్సరాన్ని కూడా ఆనందంగా ఆహ్వానిద్దాం. లోపల ఉండే చెడు ఆలోచనలను ఓడించి, మంచి ఆలోచనలకు పట్టం కడదాం. మనుషుల మధ్య ఉండే భేదభావాలను విడనాడి అందరినీ ప్రేమతో ఆదరించినప్పుడే సమాజం బాగుంటుంది. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అనే నినాదంతో కొత్త ఏడాదిలోకి అడుగు పెడదాం. ఏడాదంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ అందరికీ ఉగాది శుభాకాంక్షలు. ఈ కొత్త సంవత్సరం మీ జీవితాల్లో సరికొత్త వెలుగులను నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.

# తెలంగాణలో 2029లోనే ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి



ఢిల్లీలో బుధవారం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించిన రేవంత్ రెడ్డి, దేశ రాజకీయాల్లో రాబోయే మార్పులపై తనదైన శైలిలో విశ్లేషణ చేశారు. డీలిమిటేషన్ అనేది కేవలం నియోజకవర్గాల పునర్విభజన మాత్రమే కాదని, అది దేశ ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చే అతిపెద్ద పరిణామమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు వేచి చూడాల్సి ఉంటుందని, అందుకే 2028లో విడిగా అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఛాన్స్ తక్కువగా కనిపిస్తోందని ఆయన విశ్లేషించారు. లోక్‌సభ ఎన్నికలతో పాటే రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఓటింగ్ జరిగేలా కేంద్రం పావులు కదుపుతోందని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయ అంశాలతో పాటు తెలంగాణను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ వ్యవహారంపై కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా సీరియస్‌గా స్పందించారు. ముఖ్యంగా మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ పార్టీ ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసును ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందో వివరిస్తూ, ఇప్పటికే తొమ్మిది మంది నిష్ణాతులైన అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని ఆయన స్పష్టం చేశారు. ఈ దర్యాప్తులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కేసులో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపించడంపై రేవంత్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఆయన స్టేషన్ బెయిల్ మీద బయట ఉన్నారని, అయితే అది ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చినట్లు కాదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఎవరైనా సరే తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని, అధికార పక్షమా లేక ప్రతిపక్షమా అన్న తేడాలు తమ ప్రభుత్వానికి లేవని ఆయన తేల్చి చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం ఈ విషయంలో పూర్తి స్వేచ్ఛతో పనిచేస్తోందని, నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

తెలంగాణను "డ్రగ్స్ ఫ్రీ స్టేట్"గా మార్చడమే తమ ప్రభుత్వ అంతిమ లక్ష్యమని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఇందుకోసం కేవలం మాటలకే పరిమితం కాకుండా "ఈగల్ టీమ్" అనే సరికొత్త వ్యవస్థను రంగంలోకి దించామని ఆయన వివరించారు. ఈ టీమ్ నిరంతరం డ్రగ్స్ సరఫరా, విక్రయాలు, వినియోగంపై నిఘా ఉంచుతుందని ఆయన తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల మూలాలను వెతికి మరీ తొలగిస్తామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన తెలంగాణను అందించడమే తమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో డ్రగ్స్ నియంత్రణ విషయంలో అనేక లోపాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు. అప్పట్లో వ్యవస్థలు సరిగ్గా పనిచేయకపోవడం వల్లనే డ్రగ్స్ మాఫియా రెచ్చిపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఆ లోపాలన్నింటినీ తాము సరిదిద్దుతున్నామని, మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులను కేవలం పైపైన దర్యాప్తు చేసి వదిలేయకుండా, వాటి వెనుక ఉన్న పెద్ద తలకాయలను బయటకు తీస్తామని ఆయన వాగ్దానం చేశారు. పోలీసు యంత్రాంగానికి ఈ విషయంలో పూర్తి అధికారాలు ఇచ్చామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాదకద్రవ్యాల సరఫరా గొలుసును తెంచడానికి సాంకేతికతను కూడా విరివిగా వాడుతున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. డ్రగ్స్ ముఠాల కదలికలను గమనించడానికి అత్యాధునిక నిఘా పరికరాలను ఈగల్ టీమ్స్ ఉపయోగిస్తున్నాయని ఆయన తెలిపారు. ఇది కేవలం ఒక పోలీస్ ఆపరేషన్ మాత్రమే కాదని, ఒక సామాజిక బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోందని ఆయన అన్నారు. ప్రతి పౌరుడు కూడా ఈ పోరాటంలో ప్రభుత్వానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో పేరున్న వారు ఇలాంటి ఉదంతాల్లో దొరికితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.

డ్రగ్స్ వ్యవహారంలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాజకీయంగా ఎదుటివారిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ్యం తమకు లేదని, కానీ నేరం జరిగినప్పుడు బాధ్యులను శిక్షించడం ప్రభుత్వ ధర్మమని ఆయన వివరించారు. మొయినాబాద్ ఫామ్ హౌస్ కేసులో సిట్ దర్యాప్తు చాలా లోతుగా సాగుతోందని, మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కేసులో ఎవరెవరు పాల్గొన్నారో, వారి వెనుక ఉన్న శక్తులు ఎవరో త్వరలోనే ప్రజలకు తెలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల వాయిదా లేదా జమిలి ఎన్నికల చర్చ కేవలం కాలయాపన కోసం కాదని, అది దేశవ్యాప్త రాజకీయ అనివార్యత అని రేవంత్ రెడ్డి విశ్లేషించారు. ఒకవేళ 2029లో ఎన్నికలు జరిగితే అందుకు అనుగుణంగా పార్టీ కేడర్‌ను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో పాలనలో ఎక్కడా రాజీ పడకూడదని తన మంత్రివర్గానికి, అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల ఆశీస్సులు తమ ప్రభుత్వానికే ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా డ్రగ్స్ వంటి సున్నితమైన అంశాల్లో రాజీ లేని పోరాటం చేస్తామని చెప్పడం యువతలో ఒక కొత్త ఆశను రేకెత్తిస్తోంది.

# అభివృద్ధి బాట.. కోమటిరెడ్డి మాట!

మొదటిపేజీ తరువాయి



సంక్షేమ పథకాలకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నామో, మౌలిక సదుపాయాల కల్పనకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. అమెరికా వంటి దేశాల అభివృద్ధికి అక్కడి అద్భుతమైన రోడ్లే కారణమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పే మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, తాము అధికారంలోకి వచ్చేసరికి ఆర్ అండ్ బీ శాఖలో భారీగా బకాయిలు ఉన్నాయని కోమటిరెడ్డి ఆరోపించారు. రెగ్యులర్ బడ్జెట్ తక్కువగా ఉన్నప్పటికీ, అత్యవసర పనులను కొద్దికొద్దిగా నిధులు విడుదల చేస్తూ పూర్తి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కలెక్టర్ ఆఫీసులు, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులకు కూడా పేమెంట్లు ఇవ్వలేదని, ఇప్పుడు తమ ప్రభుత్వం ఆ బకాయిలను చెల్లిస్తోందని ఆయన వివరించారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ కాలేజీ భవనాల పనులను కూడా తమ శాఖ టేకాప్ చేసి పూర్తి చేస్తోందని వెల్లడించారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు చేసిన ఆరోపణలపై మంత్రి తీవ్రంగా మండిపడ్డారు. ఇంకా టెండర్లు కూడా తెరవకముందే అవినీతి జరిగిందని ఆరోపించడం హరీశ్ రావుకే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం సుమారు 4,600 కోట్ల రూపాయల బిల్లులను పెండింగ్‌లో పెట్టి కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కఠినమైన మార్గదర్శకాల మేరకే ఈ హ్యామ్ రోడ్ల నిర్మాణం జరుగుతుందని, ఇందులో ఎలాంటి అవకతవకలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు. పారదర్శకతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

హ్యామ్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అద్భుతమైన రోడ్లు రాబోతున్నాయని, జక్రాన్‌పల్లి నుంచి మొదలుకొని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అనుసంధానం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సిద్దిపేట, గజ్వేల్ రింగ్ రోడ్డు పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన ప్రకటించారు. రోడ్లు అనేవి కేవలం ప్రయాణ సాధనాలు మాత్రమే కావని, అవి ఒక ప్రాంత ఆర్థిక వృద్ధికి సూచికలని ఆయన అభివర్ణించారు. అందుకే భారీ బడ్జెట్‌తో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తలపెట్టామని, నిధుల సమీకరణలో ఎక్కడా వెనక్కి తగ్గబోమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు.

తన వ్యక్తిత్వం గురించి ప్రస్తావిస్తూ, తాను ఎప్పుడూ ఓపెన్‌గా మాట్లాడే వ్యక్తిని అని మంత్రి చెప్పుకున్నారు. పదవుల కంటే తనకు తెలంగాణ అభివృద్ధి, ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని ఆయన అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో రాష్ట్రం కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయాన్ని ఆయన సభకు గుర్తు చేశారు. స్వపక్షమైనా, విపక్షమైనా తప్పు జరిగితే ఖచ్చితంగా ఎండగడతానని, అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే పరమావధి అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల కల్పనలో ఆర్ అండ్ బీ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన రహదారులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో బాగు చేస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో రోడ్లు దెబ్బతినకుండా ఉండేందుకు నాణ్యతా ప్రమాణాలను పెంచుతున్నామని వివరించారు. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పనుల్లో జాప్యం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యం 2028 నాటికి సురక్షితమైన, వేగవంతమైన రవాణా వ్యవస్థను అందించడమేనని ఆయన తెలిపారు. కొత్తగా నిర్మించే రోడ్ల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని కోమటిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు తమ పండించిన పంటను మార్కెట్‌కు తరలించడం సులభతరమవుతుందని, అలాగే అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాలకు చేరుకోవడం వేగవంతం అవుతుందని చెప్పారు. రహదారుల విస్తరణతో కొత్తగా భూముల విలువ పెరగడంతో పాటు వ్యాపార అవకాశాలు మెరుగుపడతాయని ఆయన విశ్లేషించారు. తెలంగాణ అంతటా ఒకే విధమైన అభివృద్ధి జరగాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన అని, దానికి అనుగుణంగానే ఈ రోడ్ల ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకూ తగిన ఆధారాలతో సమాధానమిచ్చానని మంత్రి చెప్పారు. అభివృద్ధి పనుల్లో రాజకీయాలు చేయవద్దని, అందరూ కలిసి తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా మార్చడానికి సహకరించాలని కోరారు. పాత బకాయిలు చెల్లిస్తూనే కొత్త ప్రాజెక్టులు చేపట్టడం ఒక సవాలుతో కూడుకున్న పని అని, అయినప్పటికీ వెనకడుగు వేయకుండా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీల ప్రకారం కేంద్రం నుండి రావాల్సిన నిధుల కోసం కూడా నిరంతరం ఒత్తిడి తెస్తున్నామని ఆయన వివరించారు. తెలంగాణ రోడ్ల వ్యవస్థలో రాబోయే నాలుగేళ్లు ఒక విప్లవాత్మక మార్పును చూస్తాయని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రతి నియోజకవర్గంలో రోడ్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తామని, ప్రజలు గర్వపడేలా తమ శాఖ పనితీరు ఉంటుందని చెప్పారు. నిధుల సమీకరణకు సంబంధించి ఇప్పటికే బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో చర్చలు జరిగాయని, హ్యామ్ మోడల్ విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి సమాధానంతో సభలో చర్చ ముగిసినప్పటికీ, రాష్ట్ర రోడ్ల భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురించాయి.

## ప్రీమియం థియేటర్‌ను ప్రారంభించిన కోమటిరెడ్డి

**విశాలభారతి:**

హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్‌లో ఆసియాలోనే అతిపెద్ద స్క్రీన్‌లలో ఒకటైన 'పీసీఎక్స్ హెచ్‌డీఆర్ బై బార్కో' ప్రీమియం థియేటర్‌ను ప్రారంభించడం సంతోషకరమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక 4K లేజర్ ప్రొజెక్షన్, లైట్‌స్టీరింగ్ టెక్నాలజీతో కూడిన ఈ థియేటర్ ద్వారా ప్రేక్షకులకు మునుపెన్నడూ లేని విధంగా అత్యుత్తమ దృశ్య ప్రకాశం, శబ్ద అనుభూతి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే ప్రసాద్ మల్టీప్లెక్స్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రమేష్ ప్రసాద్ పాల్గొన్నారు.




# 700 మంది రైతులు చనిపోయారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం అత్యంత నిరాశాజనకంగా ఉందని ఆయన అభివర్ణించారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై ఎక్కడా స్పష్టత లేకపోవడం శోచనీయమని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం కేవలం మాటలతో కాలయాపన చేస్తోందని, క్షేత్రస్థాయిలో పేదవాడికి భరోసా ఇచ్చే ఒక్క అంశం కూడా గవర్నర్ ప్రసంగంలో లేదని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యంగా రాష్ట్ర అప్పుల పరిస్థితిపై మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే లక్షలాది రూపాయల అప్పులు చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం నిమిషానికి ఒక కోటి రూపాయల చొప్పున అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పులు పెరిగాయని విమర్శించిన కాంగ్రెస్, ఇప్పుడు అంతకంటే వేగంగా అప్పులు చేస్తూ ప్రజలపై పెనుభారాన్ని మోపుతోందని ధ్వజమెత్తారు. ఈ వాస్తవాలను గవర్నర్ ప్రసంగంలో ఎందుకు దాచిపెట్టారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మేనిఫెస్టోలో లేని ఈ ప్రాజెక్టును హఠాత్తుగా తెరపైకి తీసుకురావడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో లక్షా 50 వేల కోట్లు వెచ్చించాలనుకోవడం దేనికని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కనీసం డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) కూడా సిద్ధం చేయకుండా ఇన్ని వేల కోట్లు ఎలా ఖర్చు చేస్తారని నిలదీశారు. అప్పుల బాధలో ఉన్న రాష్ట్రానికి ఇంతటి ఖరీదైన ప్రాజెక్టు అవసరమా అని ఆయన అడిగారు. మూసీ ప్రాజెక్టును ప్రభుత్వం ఏటీఎంలా వాడుకోవాలని చూస్తోందని మహేశ్వర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ప్రాజెక్టు వ్యయం ఒక్కసారిగా 50 వేల కోట్ల నుంచి లక్షా 50 వేల కోట్లకు ఎలా పెరిగిందని ఆయన ప్రశ్నించారు. ఈ నిధులను సొంత ప్రయోజనాల కోసం, కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే కేటాయిస్తున్నారని ఆరోపించారు. ప్రజల సొమ్మును వృథా చేస్తూ అనవసరమైన హంగులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, అదే సమయంలో నిరుపేదలకు ఇవ్వాల్సిన పింఛన్లు, రైతు భరోసా నిధులను ఎందుకు నిలిపివేశారని ఆయన ప్రభుత్వాన్ని కడిగిపారేశారు. రైతు రుణమాఫీ అంశంపై కూడా మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని తెలిపారు. నిర్మల్ జిల్లాలోని ఏ గ్రామానికైనా వెళ్దామని, అక్కడ రుణమాఫీ కాని రైతులు లేరని నిరూపిస్తే తాను ఎంతటి శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. దాదాపు 49 వేల కోట్లు అవసరమని చెప్పి, కేవలం 17 వేల కోట్లతో రుణమాఫీ ముగించారంటే మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

హైడ్రా పనితీరుపై కూడా బీజేపీ నేత అసెంబ్లీలో గళమెత్తారు. చెరువుల ఆక్రమణల తొలగింపు పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడం సరైంది కాదని ఆయన అన్నారు. హైడ్రా దాడుల వల్ల సామాన్య ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, అదే సమయంలో బడా నేతల అక్రమ కట్టడాలను ఎందుకు ముట్టుకోవడం లేదని ప్రశ్నించారు. హైకోర్టు సైతం హైడ్రా తీరుపై అసహనం వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నిబంధనల పేరుతో పేదల పొట్ట కొట్టవద్దని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

సభలో చర్చల నుంచి ప్రభుత్వం పారిపోతోందని మహేశ్వర్ రెడ్డి ఆక్షేపించారు. అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో తాము కోరినప్పటికీ, ప్రభుత్వం కనీసం 20 రోజులు కూడా సభను జరిపేందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. ప్రజా సమస్యల గురించి ప్రస్తావిస్తుంటే సమాధానం చెప్పలేక ఎదురుదాడి చేస్తున్నారని అన్నారు. స్పీకర్ నిర్ణయాలను గౌరవిస్తూనే, ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి 'డూప్ ఫైట్' చేస్తున్నాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. సభలో ప్రధాన సమస్యలపై చర్చ జరగకుండా ఉండేందుకు ఇరు పార్టీలు పరస్పరం సహకరించుకుంటున్నాయని విమర్శించారు. కేటీఆర్ దుబాయ్ పర్యటనపై రికార్డులు ఉన్నాయని చెప్పిన ముఖ్యమంత్రి, వాటిని ఎందుకు బయట పెట్టడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందని, ఇది 'మ్యాచ్ ఫిక్సింగ్' కాదా అని ఆయన నిలదీశారు.

కేంద్ర నిధుల విషయంలో కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను మహేశ్వర్ రెడ్డి తిప్పికొట్టారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు వివక్ష చూపుతోందన్న వ్యాఖ్యల్లో వాస్తవం లేదని చెప్పారు. గత పదేళ్లలో యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో రెట్లు నిధులను రాష్ట్రానికి కేటాయించిందని వివరించారు. విభజన హామీల అమలులో కేంద్రం చిత్తశుద్ధితో ఉందని, కావాలనే రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దారుణంగా ఉందని మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు లేక వారు సొంత జేబుల నుంచి ఖర్చు చేయాల్సి వస్తోందని, దీంతో వారు అప్పుల పాలు అవుతున్నారని తెలిపారు. అలాగే నిరుద్యోగులకు ఇస్తామన్న ఐదు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. విజన్ డాక్యుమెంట్ల పేరుతో కాలక్షేపం చేయకుండా, గ్రూప్ పరీక్షలు సకాలంలో నిర్వహించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో, పింఛన్ మొత్తాన్ని 4,000 రూపాయలకు ఎప్పటి నుంచి పెంచుతారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని మహేశ్వర్ రెడ్డి కోరారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓటు వేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచించారు. ఇప్పటికైనా అప్పులు చేయడం తగ్గించి, సంపద సృష్టించే మార్గాలను అన్వేషించాలని ఆయన హితవు పలికారు.

# ఇస్మాయిల్ ఖాతిబ్ హత్య



**విశాలభారతి, అంతర్జాతీయం:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింతగా ముదురుతున్నాయి. ఇరాన్ అగ్రనేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ చేపడుతున్న వరుస దాడులు ఆ దేశాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా ఇరాన్ రాజకీయ, సైనిక యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ఇజ్రాయెల్ వ్యూహాత్మక దాడులను తీవ్రతరం చేసింది. గత నెలలో జరిగిన భారీ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఇప్పుడు ఆ దేశ నిఘా వర్గాల మంత్రి ఇస్మాయిల్ ఖాతిబ్ కూడా ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హతమవ్వడం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. ఇరాన్ గూఢచార విభాగానికి వెన్నెముకగా ఉన్న ఇస్మాయిల్ ఖాతిబ్‌ను అంతమొందించడం ద్వారా ఆ దేశ రక్షణ కవచాన్ని ఇజ్రాయెల్ ఛేదించినట్లయింది. టెహ్రాన్‌లోని కీలక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ జరిపిన ఈ మెరుపు దాడిలో ఖాతిబ్ ప్రాణాలు కోల్పోయినట్లు ఐడీఎఫ్ అధికారికంగా ధృవీకరించింది. ఇరాన్ అంతర్గత భద్రతను పర్యవేక్షించే అత్యంత కీలకమైన వ్యక్తిని కోల్పోవడం ఆ దేశానికి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించింది. ఈ క్రమంలోనే ఇరాన్ సైనిక , రాజకీయ నాయకత్వాన్ని సమూలంగా తుడిచిపెట్టేందుకు ఇజ్రాయెల్ కంకణం కట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. గత నెల 28వ తేదీన ఇరాన్ చరిత్రలోనే అత్యంత చీకటి రోజుగా మిగిలిపోయింది. ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా ఇరాన్ అధ్యక్ష భవనంపై జరిపిన భారీ దాడిలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ సహా ఆయన కుటుంబ సభ్యులు, పలువురు ప్రభుత్వ పెద్దలు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో ఖమేనీ కుమారుడు మోజ్తాబా తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ వరుస పరిణామాలు ఇరాన్ పాలనలో పెద్ద శూన్యాన్ని సృష్టించడమే కాకుండా, ఆ దేశ ప్రజల్లో తీవ్ర ఆందోళనను పెంచాయి. తాజా దాడుల్లో ఇరాన్ అత్యున్నత సైనికాధికారి, సుప్రీం లీడర్ ఖమేనీకి అత్యంత నమ్మకస్తుడైన అలీ లారిజానీ కూడా ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. లారిజానీ ఇరాన్ భద్రతా వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తూ, ప్రాంతీయ వ్యూహాలను రూపొందించడంలో దిట్టగా పేరుగాంచారు. ఆయనతో పాటు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ సోలేమానీ కూడా ఇజ్రాయెల్ దాడులకు బలికావడం ఆ దేశ సైనిక సామర్థ్యంపై నేరుగా ప్రభావం చూపుతోంది. ఈ కీలక అధికారుల మరణం ఇరాన్ ఎదురుదాడి చేసే శక్తిని గణనీయంగా తగ్గించింది. ఇరాన్ అగ్రనేతల వరుస హత్యలతో ఆ దేశం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. నిన్న ఇజ్రాయెల్ దాడిలో మరణించిన అలీ లారిజానీ అంతిమయాత్రకు టెహ్రాన్ వీధులు జనసంద్రంగా మారాయి. వేలాది మంది ప్రజలు తమ నేతకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు తరలివచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి, దీనిని బట్టి ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం మరియు ఆవేదన ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇరాన్‌పై జరుగుతున్న ఈ దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. ఏకపక్షంగా ఇజ్రాయెల్ జరుపుతున్న ఈ దాడులు అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించడమేనని క్రెమ్లిన్ మండిపడింది. ఈ ఉద్రిక్తతలు కేవలం రెండు దేశాల మధ్యే కాకుండా, మొత్తం మధ్యప్రాచ్య ప్రాంతాన్ని అస్థిరపరిచే ప్రమాదం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా మద్దతు ఇరాన్‌కు ఉన్నప్పటికీ, ఇజ్రాయెల్ అత్యాధునిక సాంకేతికత , అమెరికా సహకారంతో వరుసగా విజయాలు సాధిస్తుండటం గమనార్హం. ఇజ్రాయెల్ వ్యూహం కేవలం భూభాగాలను ఆక్రమించుకోవడం మాత్రమే కాకుండా, శత్రు దేశం నాయకత్వ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడంపై దృష్టి సారించింది. అగ్రనేతలను వరుసగా మట్టుబెట్టడం ద్వారా ఇరాన్ నిర్ణయాధికార యంత్రాంగాన్ని పక్షవాతానికి గురిచేయాలనేది ఇజ్రాయెల్ ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. దీనివల్ల ఇరాన్ మళ్లీ కోలుకోవడానికి సంవత్సరాల సమయం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సైనిక పరంగానే కాకుండా మానసిక పరంగా కూడా ఇరాన్‌ను బలహీనపరిచేందుకు ఈ దాడులు తోడ్పడుతున్నాయి.

# సభలో మూసీ సెగ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య సాగుతున్న రాజకీయ యుద్ధం ఇప్పుడు పతాక స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు చుట్టూ జరుగుతున్న చర్చలు రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వం మూసీ ప్రక్షాళనను ప్రతిష్ఠాత్మకమైన సామాజిక బాధ్యతగా అభివర్ణిస్తుంటే, మరోవైపు ప్రతిపక్ష నేత కేటీఆర్ దీనిని భారీ దోపిడీకి వేదికగా మారుతోందని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో జరిగిన మాటల యుద్ధం, బయట కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. కేవలం మూసీ మాత్రమే కాకుండా, డ్రగ్స్ కేసులు , ఇతర అంశాలపై కూడా ఇరుపక్షాల మధ్య పదునైన విమర్శలు కొనసాగుతున్నాయి. మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఈ కేసులో తప్పు చేశారని తేలడంతో, పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఆయనకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని, తాత్కాలికంగా పార్టీ నుండి సస్పెండ్ చేశామని కేటీఆర్ వెల్లడించారు. తప్పు ఎవరిదైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదని, చట్టం తన పని తాను చేసుకోవాలని ఆయన అన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి సొంత పార్టీలో తగిన గుర్తింపు లభించడం లేదని, ఆయన అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తోందని కేటీఆర్ వ్యాఖ్యానించడం విశేషం. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపై కేటీఆర్ సెటైరికల్‌గా స్పందిస్తూ, తాను ఎలాంటి పరీక్షకైనా సిద్ధమని గతంలోనే చెప్పానని గుర్తు చేశారు. "నేను రెడీ అన్నాను, మరి మీరెందుకు సైలెంట్ అయ్యారు?" అంటూ ఆయన ఎదురుదాడికి దిగారు. ఇక పార్టీ అధినేత కేసీఆర్ రాజకీయ వ్యూహాల గురించి ప్రస్తావిస్తూ, ఆయన ఎప్పుడు ఎక్కడకు రావాలో ఆయనకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తమ విమర్శలనే తట్టుకోలేకపోతోందని, ఇక కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగితే వారి పరిస్థితి ఏంటని కేటీఆర్ ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ విధానాలను అనుసరిస్తోందని, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

అసెంబ్లీలో మూసీ ప్రక్షాళన అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రభుత్వం , ప్రతిపక్షం మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబులు మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. దీనికి బదులిస్తూ కేటీఆర్, తాము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కానీ లక్షన్నర కోట్ల భారీ వ్యయంతో జరిగే "దోపిడీ"కి మాత్రమే వ్యతిరేకమని కుండబద్ధలు కొట్టారు. ప్రభుత్వం వద్ద సరైన ప్రణాళిక లేదని, ఒక్కో మంత్రి ఒక్కో రకమైన ప్రకటనలు చేస్తూ ప్రజలను అయోమయంలోకి నెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ విషయంలో మంత్రుల మధ్యే ఏకాభిప్రాయం లేదని కేటీఆర్ విమర్శించారు. మూసీ ప్రాజెక్టు ఎండీ డీపీఆర్ ఇంకా సిద్ధం కాలేదని చెబుతుంటే, మంత్రి శ్రీధర్ బాబు మాత్రం ఇప్పటికే డీపీఆర్ వచ్చిందని చెప్పడం హాస్యాస్పదమని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం గందరగోళంగా వ్యవహరిస్తోందని, ప్రజలకు వాస్తవాలు చెప్పడం లేదని ఆయన ధ్వజమెత్తారు. ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు ఇవ్వడం కంటే, మూసీ తీరాన నివసించే బాధితుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను వినాలని ఆయన సూచించారు. మూసీ నదిని మురికికూపంగా మార్చింది గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలేనని, ఇప్పుడు మళ్ళీ అదే పార్టీ ప్రక్షాళన పేరుతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న ఖర్చుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ విమర్శలను తిప్పికొడుతూ, మూసీ పరివాహక ప్రాంతంలోని పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ లక్ష్యమని అన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో, ఈగలు దోమల మధ్య బతుకుతున్న వారికి మంచి ఆవాసం కల్పించాలనేది ప్రభుత్వ సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పట్టా ఉన్నా లేకున్నా బాధితులందరికీ అపార్ట్‌మెంట్లు కట్టించి ఇస్తామని, వారి పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తామని హామీ ఇచ్చారు. ఇంత మంచి పని చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అడ్డుపడుతున్నారో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూసీకి స్వచ్ఛమైన నీరు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేనట్లు కనిపిస్తోందని భట్టి విక్రమార్క ఘాటుగా విమర్శించారు. భట్టి వ్యాఖ్యలపై కేటీఆర్ మరింత ఘాటుగా స్పందించారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్ నివాసులకు నోటీసులు ఇవ్వడం ఏంటని ఆయన నిలదీశారు. ప్రభుత్వానికి కుడి చేయి చేసేది ఎడమ చేతికి తెలియడం లేదని, అధికారుల లెక్కలకు మంత్రుల లెక్కలకు పొంతన లేదని విమర్శించారు. పేదల మీద ప్రేమ ఉందని చెబుతున్న ప్రభుత్వం, వెలుగుమట్లలో ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసినప్పుడు ఆ ప్రేమ ఎక్కడికి పోయిందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వద్ద ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి నిధులు లేవని, కేవలం రుణాల కోసం ఆర్భాటాలు చేస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో భూముల సమస్యలపై కూడా కేటీఆర్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దాదాపు కోటి ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని, దీనివల్ల సామాన్య రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, గత ప్రభుత్వం చేసిన పనులనే తాము చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారని ఆయన విమర్శించారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వం, వాటిని వివాదాల్లోకి నెడుతోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తోందని ఆయన మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రభుత్వం నుండి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. మూసీ ప్రక్షాళనపై సరైన రోడ్ మ్యాప్ లేకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని కేటీఆర్ హితవు పలికారు. లక్షన్నర కోట్ల వ్యయం వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటో ప్రజలకు తెలియాలని, అది కేవలం ప్రజా ధనం వృథా చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. తాము ప్రజా పక్షాన పోరాటం చేస్తామని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వాకౌట్ రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపింది. డ్రగ్స్ నియంత్రణ, శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మొయినాబాద్ ఫామ్ హౌస్ కేసును తమ పార్టీ తప్పును సరిదిద్దుకోవడానికి వాడుకుందని, అయితే కాంగ్రెస్ మాత్రం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలను రాజకీయాల కోసం వాడుకోవడం మానుకోవాలని సూచించారు. నిందితులు ఎవరైనా సరే చట్టం ముందు సమానమని, దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా పని చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో పెరుగుతున్న నేరాల పట్ల ప్రభుత్వం దృష్టి సారించాలని, కేవలం ప్రతిపక్షాలపై విమర్శలతో కాలం గడపవద్దని కేటీఆర్ హితవు పలికారు. మొత్తంగా చూస్తే, తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మూసీ ప్రక్షాళన, డ్రగ్స్ కేసుల చుట్టూ తిరుగుతున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తనదైన శైలిలో ముందుకు వెళ్తుంటే, కేటీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రతి అడుగును నిశితంగా గమనిస్తూ గట్టి సవాలు విసురుతోంది. ముఖ్యంగా మూసీ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు మధ్య పొంతన లేకపోవడంతో ప్రజల్లో కూడా ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ ప్రాజెక్టు ఏ దిశగా సాగుతుందో, రాజకీయంగా ఎవరికి లాభం చేకూరుస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 'మళ్లీ బరాబర్ తొక్కుకుంటూ వస్తా'

**మొదటిపేజీ తరువాయి**

రాజకీయాలకు అనర్హులని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకంపై బీఆర్ఎస్ నేతలు విషం చిమ్ముతున్నారని, వారి మాటల్లో కేవలం అధికారం కోల్పోయామనే బాధ, స్వార్థం మాత్రమే కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి ఆరోపించారు. విపక్షాలు కలిసి వచ్చినా రాకపోయినా, తమ ప్రభుత్వం ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవిష్యత్తు కోసం తమ ప్రభుత్వం రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళిక గురించి రేవంత్ రెడ్డి సభలో సుదీర్ఘంగా వివరించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి, ప్రతి ప్రాంతానికి తగిన అభివృద్ధి నమూనాను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరంపై అంతర్జాతీయ పెట్టుబడిదారులు చూపిస్తున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ప్రకటించారు. తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను సమర్థంగా అమలు చేస్తున్నామని, కేవలం ఒక్క గ్యారెంటీ మాత్రమే సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉందని, దాన్ని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మహిళల పట్ల బీఆర్ఎస్ నేతలు చూపుతున్న వైఖరిని ముఖ్యమంత్రి తీవ్రంగా ఖండించారు. సొంత పార్టీలోని మహిళా నేతలను, ఆడబిడ్డలను కించపరిచే విధంగా మాట్లాడటం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. సొంతింటి ఆడబిడ్డను గౌరవించలేని వారు రాష్ట్ర మహిళల గురించి ఏం ఆలోచిస్తారని ఆయన ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం సొంత పార్టీ నేతలతోనే అసభ్యకరంగా తిట్టించడం వంటి చర్యలు మహిళా లోకానికి అవమానకరమని ఆయన మండిపడ్డారు. మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటుంటే, దాన్ని జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

పారిశ్రామిక రంగాన్ని ప్రక్షాళన చేసేందుకు తాము ప్రవేశపెట్టిన 'హిల్ట్' పాలసీపై వస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి కొట్టిపారేశారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు పంపించడం ద్వారా నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని తాము భావిస్తుంటే, అందులో అవకతవకలు జరిగాయని చెప్పడం హాస్యాస్పదమని



అన్నారు. హిల్ట్ పాలసీపై ఏ స్థాయి విచారణకైనా తాము సిద్ధమని, అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పనులు నిర్వహిస్తున్నామని ఆయన సవాల్ విసిరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, తాము అధికారంలోకి రాగానే 13 లక్షల కొత్త కార్డులు ఇచ్చి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించామని గుర్తు చేశారు.

రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ వల్ల లక్షలాది మంది యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఆ సవాలును ఎదుర్కొనేందుకు తాము విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశామని వెల్లడించారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి, వారిని ఉపాధి రంగంలో అగ్రభాగాన నిలబెట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రేవంత్ రెడ్డి వివరించారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి సంబంధించి రేవంత్ రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి నగరాల్లో ట్రాఫిక్, కాలుష్య సమస్యలు ఏ విధంగా ఉన్నాయో మనందరికీ తెలుసని, హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకూడదనే తాము ముందుచూపుతో వ్యవహరిస్తున్నామని చెప్పారు. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని అందుకే ప్రాధాన్యతగా తీసుకున్నామని, కబ్జాకు గురైన చెరువులను విడిపించి వాటికి పూర్వవైభవం తీసుకువస్తామని స్పష్టం చేశారు. బతుకమ్మకుంట, నల్లచెరువు వంటి వాటిని పునరుద్ధరించడం ద్వారా నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నామని రేవంత్ రెడ్డి సభకు వివరించారు. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి తిప్పికొట్టారు. గతంలో కేసీఆర్ స్వయంగా నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని చెప్పారని, వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చాలని కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. వారు చెప్పిన పనులనే తాము ఇప్పుడు ఆచరణలో పెడుతుంటే, ఇవాళ దాన్ని తప్పుపట్టడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని మండిపడ్డారు. అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపుతుంటే, వాటిని అడ్డుకునేలా ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు ద్వారా నగరం రూపురేఖలు మారుతాయని, దీన్ని ఎవరు అడ్డుకున్నా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. బీజేపీ నేతల తీరును కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. కేంద్రంలో గంగా, యమున, సబర్మతి నదుల ప్రక్షాళన ప్రాజెక్టులను సమర్థిస్తున్న బీజేపీ నేతలు, తెలంగాణలో మూసీ పునరుద్ధరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ స్వార్థంతో చేస్తున్న విమర్శలేనని ఆయన కొట్టిపారేశారు. హైదరాబాద్‌లో ముంపు సమస్యను, కాలుష్యాన్ని శాశ్వతంగా పరిష్కరించాలనే సంకల్పంతో తాము భారీ వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేశామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. కేంద్రం నుంచి రావలసిన నిధుల విషయంలో బీజేపీ ఎంపీలు ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణలో గత ప్రభుత్వ వైఫల్యాలను రేవంత్ రెడ్డి ఎండగట్టారు. పదేళ్ల కాలంలో విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ కల్పించలేకపోయారని, కేవలం కాగితాలకే పరిమితం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే మెట్రో విస్తరణకు కొత్త మార్గాలను ప్రతిపాదించి, కేంద్రం నుంచి అనుమతులు పొందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటే, బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను లీజు పేరుతో అమ్ముకుందని ఘాటుగా విమర్శించారు. ఇలాంటి అవకతవకలన్నింటిపై ప్రభుత్వం నిఘా ఉంచిందని, తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

# యుద్ధంతో ఆకలి కేకలు

**విశాలభారతి, అంతర్జాతీయం:**



పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలలు కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్త ఆకలి కేకలకు దారితీస్తాయని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ ప్రపంచ ఆహార కార్యక్రమం తీవ్రస్థాయిలో హెచ్చరించింది. అమెరికా, ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఈ భీకర పోరు వల్ల అంతర్జాతీయంగా ఆహార భద్రత కరువై, నిరుపేదల బతుకులు ఛిద్రం కాబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డబ్ల్యూఎఫ్‌పీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్ల్ స్కౌ ఈ భయంకరమైన వాస్తవాలను వెల్లడించారు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆకలి చావులు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరుకునే ప్రమాదం ఉందని, మానవాళి అత్యంత క్లిష్టమైన, భయానక స్థితిని ఎదుర్కోబోతోందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాలు మరియు వివిధ సైనిక సంఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు 32 కోట్ల మంది ప్రజలు సరైన ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారని డబ్ల్యూఎఫ్‌పీ గణాంకాలు చెబుతున్నాయి. మూడో వారంలోకి ప్రవేశించిన ఈ యుద్ధం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ఆహార , ఇంధన ధరలు ఆకాశాన్ని తాకనున్నాయని కార్ల్ స్కౌ విశ్లేషించారు. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి వల్ల సరఫరా గొలుసు దెబ్బతిని, నిత్యావసర వస్తువుల వ్యయం విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ఈ ఆర్థిక అంతరాయాలు కేవలం యుద్ధం జరుగుతున్న దేశాలకే కాకుండా, ప్రపంచంలోని మారుమూల ప్రాంతాల్లో ఉండే నిరుపేద కుటుంబాలపై కూడా పిడుగులా పడనున్నాయి. యుద్ధం ఇలాగే కొనసాగితే మానవతా సంక్షోభం మరింత ముదురుతుందని, దీనిని అదుపు చేయడం అంతర్జాతీయ సమాజానికి పెద్ద సవాలుగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న దేశాల్లోని ప్రజలు ఆకలితో అలమటించే పరిస్థితి దారుణంగా ఉండబోతోందని డబ్ల్యూఎఫ్‌పీ హెచ్చరికలు జారీ చేసింది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు ఈ ధరల పెరుగుదల మోయలేని భారంగా పరిణమించనుంది.

ఒకవేళ ఈ పశ్చిమాసియా యుద్ధం జూన్ నెల వరకు గనుక కొనసాగితే, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇంధన ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, పరోక్షంగా నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకుంటాయి. దీని ఫలితంగా అదనంగా మరో 4.5 కోట్ల మంది ప్రజలు ఆకలి కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని కార్ల్ స్కౌ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ద్రవ్యోల్బణం మరియు ఆర్థిక మందగమనంతో సతమతమవుతున్న పేదలకు ఇది కోలుకోలేని దెబ్బ అవుతుంది. వారి వద్ద ఉన్న స్వల్ప పొదుపులు కూడా కరిగిపోయి, కనీసం ఒక పూట భోజనం కూడా దొరకని దుస్థితి ఏర్పడుతుందని ఆయన వివరించారు. ఈ యుద్ధ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని అత్యంత బలహీనమైన పునాదులను కదిలిస్తోంది.

వ్యవసాయ రంగంపై కూడా ఈ యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని డబ్ల్యూఎఫ్‌పీ హెచ్చరించింది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా ఎరువుల ఎగుమతులకు ఆటంకం కలగడం వల్ల పంటల దిగుబడిపై ప్రభావం పడనుంది. త్వరలో పంట సీజన్ ప్రారంభం కానున్న సోమాలియా, కెన్యా వంటి సబ్ సహారన్ ఆఫ్రికా దేశాలకు ఇది పెను ముప్పుగా పరిణమించనుంది. ఎరువుల కొరత వల్ల ఆహార ఉత్పత్తి తగ్గిపోతే, ఆయా దేశాల్లో ఆహార సంక్షోభం మరింత ముదురుతుంది. ఇప్పటికే కరువుతో అల్లాడుతున్న ఆఫ్రికా దేశాలకు పశ్చిమాసియా యుద్ధం ఒక శాపంగా మారనుంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో తలెత్తే ఇబ్బందులు ప్రపంచ ఆహార సుస్థిరతకు పెద్ద సవాలుగా నిలుస్తాయని కార్ల్ స్కౌ తన ప్రసంగంలో నొక్కి చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఆకలి సమస్య గత ఐదేళ్లలోనే మూడు రెట్లు పెరగడం గమనార్హం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఆకలి సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. అయితే, దురదృష్టవశాత్తూ ప్రజల ఆకలిని తీర్చాల్సిన ఈ కీలక సమయంలోనే ఆహార సహాయం కోసం కేటాయించే వనరులను అంతర్జాతీయ సమాజం తగ్గించిందని కార్ల్ స్కౌ విచారం వ్యక్తం చేశారు. గడిచిన ఏడాది కాలంలోనే నిధుల కేటాయింపులో 40 శాతం కోత విధించారని, దీనివల్ల డబ్ల్యూఎఫ్‌పీ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను పరిమితం చేసుకోవాల్సి వస్తోందని ఆయన తెలిపారు. నిధుల సమీకరణ ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల ఆకలితో ఉన్న కోట్ల మందికి సాయం అందించడం కష్టతరమవుతోంది. ఈ క్లిష్ట సమయంలో వనరులను తగ్గించడం వల్ల లక్షలాది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది.

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా డబ్ల్యూఎఫ్‌పీ సంస్థ నిర్వహణ వ్యయాలు కూడా భారీగా పెరిగిపోయాయి. ఇంధన ధరలు పెరగడం వల్ల ఆహార పదార్థాలను సుదీర్ఘ మార్గాల్లో రవాణా చేయాల్సి వస్తోంది. నౌకల రవాణా వ్యయాలు ఇప్పటికే 18 శాతం మేర పెరిగాయని, ట్రక్కుల ఛార్జీలు కూడా భారంగా మారాయని సంస్థ వెల్లడించింది. దీనివల్ల గతంలో కంటే తక్కువ మందికి మాత్రమే ఆహార సాయం అందజేయగలుగుతున్నారు. ఒకవైపు అవసరాలు పెరుగుతుంటే, మరోవైపు ఖర్చులు పెరిగి నిధులు తగ్గడం డబ్ల్యూఎఫ్‌పీని ఇరుకున పెడుతోంది. యుద్ధం వల్ల తలెత్తిన భద్రతా పరమైన ఇబ్బందులు కూడా సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఈ రవాణా వ్యయాల భారం అంతిమంగా పేదలకు అందాల్సిన ఆహార పరిమాణాన్ని తగ్గిస్తోంది.

ప్రస్తుతం ఇజ్రాయెల్‌తో ఘర్షణ పడుతున్న లెబనాన్‌లో డబ్ల్యూఎఫ్‌పీ నిరంతరం సహాయక చర్యలు చేపడుతోంది. అక్కడ వేలాది మంది నిరాశ్రయులకు, పేదలకు భోజనాలు, బ్రెడ్ పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమాలను కనీసం మరో మూడు నెలల పాటు కొనసాగించాలంటే సంస్థకు అత్యవసరంగా రూ.711 కోట్లు అవసరమని కార్ల్ స్కౌ వెల్లడించారు. తగినన్ని నిధులు అందకపోతే లెబనాన్‌లో కూడా ఆహార పంపిణీ నిలిపివేయాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు కనీస అవసరాల కోసం అల్లాడుతున్న తరుణంలో, అంతర్జాతీయ సమాజం ఉదారంగా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిధుల కొరత వల్ల సహాయక చర్యలు ఆగిపోతే అది మరింత పెద్ద విపత్తుకు దారితీస్తుంది. ఆఫ్రికా ఖండంలోని సోమాలియా పరిస్థితి కూడా అత్యంత దయనీయంగా తయారైంది. గత రెండేళ్లుగా ఆ దేశం తీవ్రమైన కరువుతో అల్లాడుతోంది. సరైన నిధులు లేకపోవడం వల్ల అక్కడ ఉన్న బాధితులందరికీ సాయం చేయలేకపోతున్నామని డబ్ల్యూఎఫ్‌పీ తెలిపింది. కేవలం 7 లక్షల మందికి మాత్రమే ప్రస్తుతానికి సాయం అందించాలని నిర్ణయించినట్లు సంస్థ వెల్లడించింది. నిధుల కొరత వల్ల సహాయం పొందే వారి సంఖ్యను కుదించాల్సి రావడం అత్యంత బాధాకరమని కార్ల్ స్కౌ పేర్కొన్నారు. సోమాలియాలో ఆకలి చావులు పెరగకుండా చూడాలంటే తక్షణమే ఆర్థిక వనరులు అవసరమని ఆయన గుర్తు చేశారు. కరువు ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం అందించడం ఇప్పుడు మృత్యువుతో పోరాటం లాంటిది. కరువు, యుద్ధంతో దెబ్బతిన్న సూడాన్‌లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అక్కడ ప్రజలకు అందిస్తున్న నిత్యావసర వస్తువుల పరిమాణాన్ని కూడా డబ్ల్యూఎఫ్‌పీ తగ్గించాల్సి వచ్చింది. నిధుల కొరత వల్ల ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవడం తప్పడం లేదని సంస్థ వివరించింది. సూడాన్‌లో నిరంతరం జరుగుతున్న అంతర్గత పోరాటాలకు తోడు ఇప్పుడు పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన ఆర్థిక భారం ఆ దేశాన్ని మరింత కుంగదీస్తోంది. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య అక్కడ రోజురోజుకూ పెరుగుతోంది. వారికి కనీసం పాలు, బిస్కెట్లు వంటివి కూడా అందించలేని స్థితిలో సహాయక సంస్థలు ఉండటం దారుణమైన విషయం. అంతర్జాతీయ స్థాయిలో శాంతి స్థాపన జరగకపోతే ఈ దేశాలు కోలుకోవడం అసాధ్యం.

# అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

**ఆర్మూర్, విశాలభారతి:**

జవహర్ నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఆ ర్వత సాధించిన నందిపేట్ మండల కేంద్రంలోని ఉజ్వల హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు బట్టు రిషిక, సాంబారు శ్రీనిధి , మూడు విగ్నేష్ జిల్లా స్థాయిలో ఏడవ మరియు 18 వ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల మేనేజ్మెంట్ బుధవారం సన్మానించారు. ఆ ర్వాత సాధించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల హై స్కూల్ కరస్పాండెంట్ గోజురిఅరుణ్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బయ్యారంలో పదవ తరగతి పరీక్షా కేంద్రం పరిశీలన



**బయ్యారం, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా డిఎస్పీ తిరుపతిరావు బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా, పరీక్షల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ఎలాంటి అక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రాధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థులు ఎటువంటి భయాందోళనలు లేకుండా పరీక్షలు రాయాలని డిఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో బయ్యారం ఎస్ఐ పోలీసు సిబ్బంది, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**మహబూబాబాద్ , విశాలభారతి:** మహబూబాబాద్ పట్టణంలోని రైల్వే గేట్ ప్రాంతం హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ, మల్యాలలోని శ్రీధర ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ లను ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాములోని నిలువ ఉన్న గ్యాస్ వివరాల రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్స్, ఆన్లైన్ లో వచ్చిన వారి జాబితా వివరాలను తనిఖీ చేశారు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో పకడ్బందీగా గ్యాస్ సరఫరా చేయాలని, డబుల్ సిలిండర్లు తీసుకున్న వారిని గుర్తించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సరఫరాను కొనసాగించాలని, విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీలలో పంపిణీ జరుగుతున్నటువంటి ప్రక్రియలు పరిశీలించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా సరఫరా చేస్తున్నటువంటి గ్యాస్ సిలిండర్ లను గుర్తించి కేసముద్రం మండలం ఉప్పరపల్లి లో డొమెస్టిక్ గ్యాస్, హెచ్పి, భారత్, ఇండియన్, తదితరులపై నాలుగు కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం డిమాండ్కు అనుగుణంగా జిల్లాలో గ్యాస్ నిల్వలు ఉన్నాయని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. అనవసరంగా ముందస్తు గ్యాస్ బుకింగ్ లు చేయరాదని, గవర్నమెంట్ సూచించిన ప్రకారం 25 రోజుల తర్వాతనే గృహ అవసరాల నిమిత్తం గ్యాస్ బుక్ చేసుకోవాలని తెలిపారు. గ్యాస్ కొరత ఉందని తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కోరారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి రమేష్ నాయక్, స్థానిక తహసిల్దార్ రాజేశ్వర్, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

**అదనపు కలెక్టర్ ఆదేశాలు**



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో బుధవారం విస్తృత పర్యటన నిర్వహించారు. తొర్రూరు, పెద్ద వంగర మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన స్వయంగా పరిశీలించారు. తొర్రూరు మండల కేంద్రంలోని అమ్మాపురం రోడ్డు, గోపాలగిరి రోడ్డు ప్రాంతాల్లో నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇళ్ల పనులను పరిశీలించిన ఆయన, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత గృహం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే పూర్తి అయిన ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంతర్గత పనులు, విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి కల్పన, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని హెచ్చరించారు. పెద్ద వంగర మండల కేంద్రంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, విద్యార్థులకు నిర్దిష్ట ఆహార పట్టిక ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, తేలికపాటి అల్పాహారాలు అందించాలని సూచించారు. నాణ్యమైన పదార్థాలతో రుచికరమైన ఆహారం అందించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపర్చేందుకు ప్రత్యేక తరగతులు, ఆధునిక డిజిటల్ బోధన పద్ధతులను అమలు చేయాలని సూచించారు. హాస్టల్ పరిసరాల్లో శుభ్రత పాటిస్తూ కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట తొర్రూరు ఆర్డీవో గణేష్, తహసీల్దార్లు శ్రీనివాస్, వినోద్, ఎంపీడీవో వేణుమాధవ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి మరియు వారి సమస్యల పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌లోని సంబంధిత కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. ఈ కమిటీలో భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన గరిష్టంగా ఐదుగురు అనధికార సభ్యులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండే అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, కుల ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. అలాగే ఎలాంటి పోలీసు కేసులు లేని వారు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఇక ఇతర వర్గాలకు చెందిన, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలతో అనుబంధం ఉన్న వ్యక్తుల నుంచి గరిష్టంగా ముగ్గురు సభ్యులను కూడా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరు ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండటంతో పాటు గతంలో స్వచ్ఛంద సంస్థల ద్వారా నిర్వహించిన సేవా కార్యక్రమాలలో పాల్గొన్న వివరాలు, పత్రిక కత్తిరింపులు, ప్రభుత్వం అందజేసిన పురస్కారాల వివరాలు సమర్పించవలసి ఉంటుందని పేర్కొన్నారు. వీరికి కూడా కుల ధృవీకరణ పత్రం మరియు పోలీసు కేసులు లేనట్లు ధృవీకరణ అవసరమని తెలిపారు. ఆసక్తి గల అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధృవీకరణ పత్రాలతో కలిసి మహబూబాబాద్ జిల్లా ఐడీఓసీ భవనంలోని ఎస్17 నందు ఉన్న జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మార్చి 25, 2026 సాయంత్రం ఐదు గంటలలోపు సమర్పించవచ్చని సూచించారు. గడువు తేదీ తర్వాత అందిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోబడవని, అభ్యర్థుల ఎంపిక పూర్తిగా జిల్లా స్థాయి కమిటీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

## హోటల్,దుకాణదారులకు శుభ్రతపై దిశానిర్దేశం

**సుర్వి మల్లేశం గౌడ్ సర్పంచ్**

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని హైవే 65 రోడ్డు వద్ద సుర్వి మల్లేష్ గౌడ్ సర్పంచ్ పర్యవేక్షణలో గ్రామ పారిశుద్ధ్య కార్మికులతొ రోడ్లు ఊడ్చి చెత్తని ట్రాక్టర్లు తరలించేటట్లుగా మరియు రోడ్లకు విరువైపులా చెత్త వేయకుండా హోటల మరియు దుకాణదారుల ఎదుట చెత్తా లేకుండా ఉంచుకోవాలని సూచించి వారికి దిశానిర్దేశం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వలందాస్ మహేష్ గౌడ్ ఉప సర్పంచ్,వార్డు సభ్యులు బత్తుల అనుష మహేష్ గౌడ్,పాలెం వెంకటేశం గౌడ్,ముద్దం లింగస్వామి గౌడ్,దొడ్ల అండాలు శెట్టయ్య గౌడ్,దండుగల వెంకటేశం,బొమ్మని శ్రావణి స్వామి గౌడ్,రాపోలు రేణుక మల్లేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండు గౌడ్ గ్రామ పంచాయతీ హోటల్,షాపుల యాజమాన్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# హర్మ్యూజ్ వద్ద అమెరికా భీకర దాడులు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో యుద్ధం భీకర రూపం దాల్చింది. 19వ రోజుకు చేరుకున్న ఈ పోరులో ఇజ్రాయెల్, అమెరికా బలగాలు ఇరాన్‌పై విరుచుకుపడుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ నౌకా రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిపై ఇరాన్ పట్టును సడలించేందుకు అమెరికా వ్యూహాత్మక దాడులు ప్రారంభించింది. శక్తిమంతమైన బీ2బీ బాంబర్ల ద్వారా 5 వేల పౌండ్ల బరువున్న భారీ 'బంకర్ బస్టర్' బాంబులను ఇరాన్ తీరప్రాంతంలోని క్షిపణి స్థావరాలపై ప్రయోగించింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన నౌకా విధ్వంసక క్రూయిజ్ క్షిపణి కేంద్రాలు ధ్వంసమైనట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ధృవీకరించింది. మరోవైపు ఇజ్రాయెల్ రక్షణ దళాలు లెబనాన్‌లోని హెజ్బొల్లా లక్ష్యాలపై విరుచుకుపడుతున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని టైర్ నగరంలో గల హెజ్బొల్లా మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు నిర్వహిస్తున్నట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. దాడికి ముందు స్థానిక ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొంది. లెబనాన్ రాజధాని బీరూట్‌లోని బచౌరా ప్రాంతంలో జరిగిన భారీ పేలుడులో ఆరుగురు మరణించగా, 24 మంది గాయపడినట్లు నివేదికలు అందుతున్నాయి. మంగళవారం రాత్రి హెజ్బొల్లా కమాండ్ సెంటర్లను, బెకా ప్రాంతంలోని రాకెట్ లాంచ్ స్థావరాలను ఇజ్రాయెల్ నేలమట్టం చేసింది.

ఇరాన్ రాజకీయ నాయకత్వాన్ని సమూలంగా తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ అడుగులు వేస్తోంది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీయే తమ తదుపరి టార్గెట్ అని ఐడీఎఫ్ స్పష్టం చేసింది. ఆయన ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నప్పటికీ, వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించింది. ఏప్రిల్ మొదటి వారంలో వచ్చే 'పాసోవర్' పండుగ సమయంలోనూ సైనిక చర్యలు కొనసాగుతాయని, ఇజ్రాయెల్ భద్రతకు ముప్పుగా పరిణమించే ప్రతి ఒక్కరినీ ఏరివేస్తామని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది. ఈ ప్రకటనతో ఇరాన్ పాలక వర్గంలో వణుకు మొదలైంది.



యుద్ధం కేవలం ఇరాన్, లెబనాన్‌లకే పరిమితం కాకుండా గల్ఫ్ దేశాలకు కూడా పాకింది. ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను తమ గగన రక్షణ వ్యవస్థలు సమర్థంగా తిప్పికొడుతున్నాయని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దుబాయ్ పరిసరాల్లో వినిపిస్తున్న భారీ శబ్దాలు క్షిపణి నిరోధక వ్యవస్థల ప్రతిస్పందన వల్లేనని అధికారులు స్పష్టం చేశారు. యూఏఈ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైరన్లు మోగినప్పుడు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా బహ్రెయిన్, కువైట్ దేశాలు కూడా హై అలర్ట్ ప్రకటించాయి. బహ్రెయిన్‌లో సైరన్లు మోగడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. శత్రు దేశాల నుంచి వచ్చే క్షిపణులు, డ్రోన్లను అడ్డుకుంటున్నట్లు కువైట్ సైన్యం వెల్లడించింది. మార్చి 17 ఒక్క రోజే యూఏఈ రక్షణ వ్యవస్థలు 10 బాలిస్టిక్ క్షిపణులను, 45 డ్రోన్లను కూల్చివేశాయి. ప్రస్తుత ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుండి యూఏఈ సైన్యం మొత్తం 314 బాలిస్టిక్ క్షిపణులు, 1,672 డ్రోన్లను ధ్వంసం చేయడం గమనార్హం.

ఈ ఉద్రిక్తతల మధ్య అమెరికా తన నావికాదళ శక్తిని పెంచుతోంది. అమెరికాకు చెందిన భారీ యుద్ధనౌక 'యూఎస్ఎస్ ట్రిపోలి' సింగపూర్ సమీపంలోని మలక్కా జలసంధి వైపు వేగంగా కదులుతోంది. జపాన్‌లోని ఒకినావా నుంచి బయలుదేరిన ఈ నౌక గంటకు 22 మైళ్ల వేగంతో పశ్చిమాసియా వైపు వస్తోంది. రద్దీగా ఉండే సముద్ర మార్గాల్లో భద్రత కోసం ట్రాన్స్‌పాండర్లను ఆన్ చేసిన ఈ నౌక కదలికలను మారిటైమ్ నిపుణులు నిశితంగా గమనిస్తున్నారు. అమెరికా సైనిక కదలికలు పెరగడం చూస్తుంటే యుద్ధం మరింత తీవ్రం కానుందని అర్థమవుతోంది.

ఇరాన్ అగ్రనేతల వరుస మరణాలు ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. గూఢచార మంత్రి ఇస్మాయిల్ ఖాతిబ్, సైనికాధికారి అలీ లారిజానీ వంటి కీలక వ్యక్తులను కోల్పోవడం ఇరాన్‌ను కోలుకోలేని దెబ్బతీసింది. మరోవైపు ఇరాన్ అధ్యక్ష భవనంపై జరిగిన దాడిలో గాయపడిన మొజ్తాబా ఖమేనీ కోసం ఇజ్రాయెల్ గాలింపు ముమ్మరం చేసింది. నాయకత్వ లేమితో ఇరాన్ సాయుధ బలగాలు గందరగోళంలో పడ్డాయి. ఈ పరిణామాలు గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరమైన సవాళ్లను పెంచుతున్నాయి. రష్యా ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇజ్రాయెల్‌అమెరికా కూటమి పైచేయి సాధిస్తోంది. ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా, హమాస్ వంటి సంస్థలు కూడా వరుస దాడులతో బలహీనపడుతున్నాయి. ఇరాన్ నిఘా వ్యవస్థలను మొసాద్ పూర్తిగా ఛేదించిందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏకపక్షంగా సాగుతున్న ఈ దాడులు ఇరాన్ ఇంధన ఎగుమతులను మరియు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే అవకాశం ఉంది. ఇది ప్రపంచ మార్కెట్లలో చమురు ధరల పెరుగుదలకు దారితీస్తోంది. గల్ఫ్ దేశాల్లోని విమానయాన రంగం కూడా ఈ యుద్ధం వల్ల ప్రభావితమవుతోంది. క్షిపణి దాడుల భయంతో పలు అంతర్జాతీయ విమాన సంస్థలు తమ మార్గాలను మళ్లించాయి. అబుదాబి, దుబాయ్ వంటి కీలక నగరాల మీదుగా విమాన రాకపోకలకు ఆంక్షలు విధించే అవకాశం ఉంది. ప్రజలు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని, సోషల్ మీడియాలో వచ్చే పుకార్లకు గురికావద్దని యూఏఈ ప్రభుత్వం కోరింది. నిరంతర క్షిపణి దాడుల నేపథ్యంలో గగనతలంపై నిఘాను మరింత కఠినతరం చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తాజా పరిణామాలపై స్పందిస్తూ, తమ దేశ ఉనికికి ముప్పు తెచ్చే శక్తులను ఎక్కడున్నా వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు. పాసోవర్ పండుగ నాటికి ఇరాన్ అణు, క్షిపణి సామర్థ్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలనేది ఇజ్రాయెల్ లక్ష్యంగా కనిపిస్తోంది. దీనికి అమెరికా బాంబర్లు తోడవ్వడంతో పశ్చిమాసియాలో మునుపెన్నడూ లేని విధంగా యుద్ధం తీవ్రతరమైంది. ఇరాన్ ప్రతిస్పందన ఎలా ఉంటుందనే దానిపై ఇప్పుడు అందరి దృష్టి ఉంది. మొత్తానికి, పశ్చిమాసియా రాజకీయ ముఖచిత్రం శరవేగంగా మారిపోతోంది. దశాబ్దాలుగా సాగుతున్న ఆధిపత్య పోరు ఇప్పుడు ముగింపు దశకు చేరుకున్నట్లు అనిపిస్తోంది. అగ్రనేతల హత్యలు, బంకర్ బస్టర్ బాంబుల ప్రయోగం, యుద్ధనౌకల కదలికలు అన్నీ ఒక పెను వినాశనాన్ని సూచిస్తున్నాయి. ఈ మహా యుద్ధంలో సామాన్య ప్రజలు బలికాకుండా ఉండాలని అంతర్జాతీయ సమాజం కోరుకుంటున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు మాత్రం శాంతికి దూరంగానే ఉన్నాయి. రానున్న కొద్ది రోజులు ఈ ప్రాంత భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## ప్రజల సొమ్మును దోచుకుంటే ఊరుకోం

**సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్**

**దేవరుప్పల, విశాలభారతి:**



మండలకేంద్రానికి ఇతర మండలాల నుండి ప్రజలు తమ అవసరాల కోసం వస్తూ పోతుంటారు. ప్రయాణికులు సుదూరాలకు వెళ్లేందుకు చౌరస్తాలో గంటల తరబడి నిరీక్షిస్తుంటారు.అయితే ఇక్కడ మూత్రశాలలు లేక ముఖ్యంగా మహిళలు తీవ్రయిబ్బందులు ఎదుర్కొంటున్నారు.పాత బస్టాండ్ స్థలంలోనే సులబ్ కంప్లెక్స్ నిర్మించాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అఖిల పక్ష నాయకులు బస్టాండ్ ఆవరణలో ధర్నాలు కూడా చేశారు. అందులో భాగంగానే గత వారం దేవరుప్పుల మండల ఎంపీడీఓ మేనకా పౌడేల్ ప్రొసీడింగ్ కాపీని దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ కు అందజేశారు.సర్పంచ్ కృష్ణమూర్తి సులబ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించగా ఆ స్థల కుటుంబీకులు కృష్ణమూర్తికి కోర్టు నుండి నోటిసులు పంపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణమూర్తి మీడియాతో మాట్లాడుతూ దేవరుప్పుల మండలకేంద్రం అభివృద్ధి కోసం మహిళల ఆత్మగౌరవం కోసం మండలకేంద్రంలోని చౌరస్తా సమీపంలో సులబ్ కాంప్లెక్స్ కావాలని పార్టీలకు అతీతంగా ప్రజానాయకులు పోరాటం చేశారని,గత యాభై సంవత్సరాల క్రితమే బస్టాండ్ కోసం గోలి మల్లారెడ్డి ఆర్టీసికి దానం ఇచ్చాడని,అప్పుడే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ బస్టాండ్ ను నిర్మించిందని,ఆ విషయం చుట్టూ ప్రక్కల గ్రామ ప్రజలందరికి తెలుసని,కానీ ఇప్పుడు ఆ స్థలం కావాలని ఆ స్థలం మాకు రిజిస్ట్రేషన్ అయ్యిందని,ఆ స్థలం మాదేనని మల్లారెడ్డి కూతురు రేణుక బూటకపు మాటలు మాట్లాడుతున్నారని,మహిళల ఆత్మగౌరవం కాపాడేందుకు ప్రజల సౌకర్యం కోసం సర్పంచ్ గా గెలిచిన తర్వాత అధికారులు, స్వచ్ భారత్ సూచన మేరకు ఇక్కడ సులబ్ కాంప్లెక్స్ కట్టడం కోసం ఉత్తర్వులు జారీచేశారని, అందులో భాగంగానే ఇక్కడ సులబ్ కాంప్లెక్స్ నిర్మించడంకోసం పనులు ప్రారంభించానని, ఎప్పుడైతే పనులు ప్రారంభించానో మల్లారెడ్డి కూతురు కోర్టు నుండి నాకు ఉత్తరం పంపిందని,అందుకు కొంతమంది వారికి తొత్తులుగా మారి వారికి సలాహాలు ఇస్తూ ఇక్కడ జరిగే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని,గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా తీర్మాణం చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తీర్మాణం చేసిందని, ప్రజల వసతుల కోసం కోర్టు ఆదేశానుసారం ఎంత దూరమైనా వెళతానని,ప్రజల పక్షాన నిలబడి కొట్లాడి ఇక్కడ సులబ్ కాంప్లెక్స్ నిర్మించడానికి సిద్ధంగా ఉన్నానని,మహిళల ఆత్మగౌరవం కోసం త్వరలో కలెక్టర్ గారిని కలిసి వినతి పత్రాన్ని ఇస్తానని,ప్రజలకు సంభందించిన సొమ్మును ప్రయివేటు వ్యక్తులు దోచుకోకుండా కాపాడుకోవాలని మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య,గౌడిశాల శ్రీనివాస్,తోటకూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు చింత ఐలయ్య, కారుపోతుల సోమయ్య, రెడ్డిరాజుల కిష్టయ్య,గౌడిశాల రాములు ,రుద్రోజు చారి,కడారి అంజయ్య,భాషిపాక మధు, కారుపోతుల మహేష్, పత్తేపురపు శేఖర్,తోటకూరి మహేష్,చిలుకూరి ఉమేష్, కారుపోతుల సురేష్, ఉప్పుల విజయ్,గంగాడి అఖిల్, గ్రామస్తులు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా ఉగాది వేడుకలు



**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఉగాది పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం సంప్రదాయ వాతావరణంతో కళకళలాడింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉగాది పచ్చడి ప్రాముఖ్యత, తెలుగు సంవత్సరాది విశేషాలపై ఉపాధ్యాయులు వివరణ ఇచ్చారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, పద్యాలు, ప్రసంగాలతో అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ కే. చంద్రమౌళి మాట్లాడుతూ, ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి పండుగల ద్వారా విద్యార్థుల్లో భారతీయ విలువలు పెంపొందుతాయని తెలిపారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి మధు మాట్లాడుతూ తెలుగు వారందరికీ కొత్త సంవత్సరం ఉగాది అని, ప్రపంచం లో ఉన్న తెలుగు వారందరు ఈ రోజునా ఎంతో ఆనందోత్సహాల తో ఘనంగా జరుపుకుంటారని, పండుగ రోజున పొద్దున్నే లేచి అభ్యంగన స్నానం చేసి కొత్త బట్టలు వేసుకొని గుడికి వెళ్లి పూజలు చేసి, ఉగాది పచ్చడి తిని,పంచాంగ శ్రవణం విని రోజంతా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారని తెలియజేశారు. మన సంస్కృతి సంప్రదాయం పట్ల సరియైన అవగాహనా కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాల విద్యార్థులను స్వయంగా పాల్గొనేలా చేసి వారిలో ఉత్సాహం నింపుతామని తెలియచేసారు. అంతేకాకుండా పండుగ విశిష్టతను వివరిస్తూ చాలా రకాల ఉదాహరనలున్నా రాముడు లంకను జయించి అయోధ్య కు వొచ్చిన రోజు చైత్రమాసా శుద్ధ పాడ్యమి రోజున అని అదే రోజుని ఉగాది అని పురాణాలలో ఉందని హిందువుల నమ్మకమని, ఉగాది పచ్చడి లొ షడ్రుచులు ఉంటాయని అవి మన జీవితానికి అణువదించుకుంటే ఎన్నో రకాల ఉద్వేగాలు ఉంటాయని వాటిని పాజిటివ్ గా తీసుకొని ముందుకెళ్తేనే జీవితం ఫలప్రదంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కూడా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలి



**మహబూబాబాద్, విశాలభారతి:** ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతాంగానికి మేలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు నల్లు సుధాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వర్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం మహ బాద్ జిల్లా కలెక్టరేట్ లో ధర్నా నిర్వహించి జిల్లా అదనపు కలెక్టర్ కే అనిల్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మక్కలు ఈసారి అధికంగా రైతులు సాగు చేశారని వాటిని మార్క్ ఫెయిర్ ద్వారా 2400 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని, సాదా బై నామా కేవలం పత్రిక ప్రకటనలకు మాత్రమే పరిమితం అయినాయని రైతులకు ఆచరణలో ఏమాత్రం అమలు కావడం లేదు కాబట్టి కొర్రీలు లేకుండా సాదా బైనామాలను రైతాంగానికి అందుబాటులో తేవాలని, రెండు లక్షలకు పైనున్న రైతుల పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని, రైతు భరోసా నిధులను వారి ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తండ సతీష్, రామగోని రవి, వెంకటేశ్వర్లు, ఉపేందర్ రుణవత్ రమేష్, జిన్నా వీరయ్య తరులు పాల్గొన్నారు.00

## ఉగాది పండగ శుభాకాంక్షలు

**జక్కల రేవతి మహేష్ సర్పంచ్ జక్కలవారి గూడెం**



**మునుగోడు, విశాలభారతి:** జక్కల వారి గూడెం ప్రజలకు గ్రామ సర్పంచ్ జక్కల రేవతి మహేష్ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది పండుగను ప్రజలంతా ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకోవాలని, అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జీవితంలో తీపి, చేదు, కష్టాలు, సుఖాలు సహజమని, వాటిని సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఉగాది పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ప్రపంచ మానవాళికి అన్నం పెట్టే రైతన్నలకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, సిరిసంపదలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న వితరణ



**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపాలిటీ పట్టణంలో బస్టాండ్ వద్ద అమావాస్య సందర్భంగా చౌటుప్పల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచి కంటి భాస్కర్ గుప్తా విచ్చేసి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం మంచి కంటి భాస్కర్ మాట్లాడుతూ అమావాస్య సందర్భంగా ఆర్య సంఘం ఆధ్వర్యంలో ఒక పూట ఉచితంగా అన్న ప్రసాద్ పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉదన్నారు. అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న పేదవారికి ఒక పూట ఉచితంగా భోజనం పంపిణీ చేయడం ఆర్యవైశ్యులని అభినందించారు.ఈ కార్యక్రమంలో చౌటుప్ప మండల ఆర్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా,తడకమళ్ళ శ్రీనివాస్ గుప్తా,దాచేపల్లి విజయ్,నీలా సత్యనారాయణ,దాచేపల్లి శ్రీనివాస్, శోభన్ బాబు,శ్రీమన్నారాయణ,సాయి, రవి జ్యువెలర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార రంగంలో యువత రాణించాలి

**ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్**




చౌటుప్పల్,విశాలభారతి: వ్యాపార రంగంలో యువత రాణించాలని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ ఆకాంక్షించారు.మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గాన్విక కిరాణం దుకాణాన్ని బుధవారం అయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.వ్యాపార ప్రోత్సాహకంలో భాగంగా 25 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానికంగా చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందడం సంతోషకరమని పేర్కొన్నారు.ఫౌండేషన్ ఎప్పుడూ కష్టాల్లో ఉన్నవారికి, కొత్తగా ఎదగాలనుకునే వారికి అండగా ఉంటుందని తెలిపారు.చిన్న చిన్న వ్యాపారాలను మనమందరం ప్రోత్సహించినప్పుడే స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్ ,ఆలె చిరంజీవి,ఉదరి యాదయ్య, ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్‌బీ నగర్ రాజకీయాల్లో 'డ్రగ్ టెస్ట్' ఛాలెంజ్



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హైదరాబాద్‌లో ఎల్‌బీ నగర్ రాజకీయాలు 'డ్రగ్ టెస్ట్' ఛాలెంజ్‌తో వేడెక్కాయి. మొయినాబాద్ ఫార్మ్‌హౌస్ ఘటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు వైట్ ఛాలెంజ్ విసరడం విడ్డూరంగా ఉందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి విమర్శించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎల్‌బీ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు తమ ఎమ్మెల్యేతో కలిసి వైట్ ఛాలెంజ్‌కు వస్తే కాంగ్రెస్ నాయకులు కూడా సిద్ధంగా ఉంటారని తెలిపారు. వైట్ ఛాలెంజ్‌కు సిద్ధమైతే ఉగాది రోజున మధ్యాహ్నం 3 గంటలకు ఎల్‌బీ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద డ్రగ్ టెస్ట్‌కు రావాలని సవాల్ విసిరారు. ఇందుకోసం అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులు అక్కడే ఉంటారని పేర్కొన్నారు. గత పదేళ్లలో తెలంగాణను డ్రగ్స్ హబ్‌గా మార్చిందీ బీఆర్ఎస్ పార్టీయేనని ఆరోపిస్తూ, డ్రగ్స్ ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు సవాళ్లు విసరడం అనర్థమని విమర్శించారు. ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ పన్నాల జైపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరమల రామచంద్రరెడ్డి, ఎల్‌బీ నగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివకుమార్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 6 గ్యారంటీల స్కీమ్ ఎక్కడ..?



**ముషీరాబాద్,విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీ ల హామీతో అధికారంలోకి వచ్చి ఆ గ్యారంటీలను విస్మరించిందని బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ చుక్క గణేష్ ముదిరాజ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న 6 గ్యారెంటీల స్కీమ్ అమలు ఎక్కడా అని ప్రశ్నించారు. అర్హులైన ప్రజలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధి చేకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీ ల స్కీములకు అర్హులైన ప్రజలకు ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. పథకాలు ప్రారంభించిన సరైన విధంగా ప్రభుత్వం అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల స్కీమును అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ స్కీములు ప్రజలకు అందే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమం




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ కార్యాలయం సహకారంతో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వద్దు అని చెప్పాల్సిన అవసరం అనే అంశంపై ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు మాట్లాడుతూ.. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వల్ల సముద్ర జీవరాశి, నేల ఆరోగ్యం, మానవ శ్రేయస్సుపై తీవ్రమైన దుష్ప్రభావాలు ఉంటాయని తెలిపారు. వాటి వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పర్యావరణ ఇంజనీర్ ఎం. వెంకట్ నర్సు, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త డా. ఆర్. మహేష్ ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావం, నివారణ మార్గాలపై వివరించారు. గ్లోబల్ రీసైక్లింగ్ డే సందర్భంగా పర్యావరణ హిత చర్యలను అనుసరించాలని విద్యార్థులను కోరారు. చివరగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సంకల్పం వ్యక్తం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మధు ధర్మపురి, డా. డి. బాల నరసింహ, డా. వి. శేఖర్, డా. వి. గీతా నాయక్, డా. దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

## జన జాగరణ జాతరకు మద్దతు ప్రకటించిన ప్రజా గాయకుడు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మన ఆలోచన సాధన సమితి (మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు నివాసంలో తెలంగాణ ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే ఏప్రిల్ 19న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న జన జాగరణ జాతర కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తన వంతు ప్రముఖ పాత్ర ఉంటుందని ఏపూరి సోమన్న తెలిపారు. ఈ సమావేశంలో మాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెదవుర బ్రహ్మయ్య, దువ్వాల శ్రీకాంత్, సోషల్ మీడియా కార్యదర్శి కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బంగారు గడ్డ దశరథ, దూది గాని వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**ఆర్థిక సాయం అందజేసిన బూర నర్సయ్య గౌడ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ తారమతిపేట్ గ్రామంలో పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న బీజేపీ కార్యకర్త మద్ది శివ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే ఇటీవల మరణించిన పారిశుద్ధ కార్మికురాలు కోరను పెద్ద లక్ష్మమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఇదే సందర్భంలో బలిజగూడ మాజీ సర్పంచ్ ఇరిగి జంగయ్య తండ్రి మృతిపై వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి కూడా ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వడేపల్లి పాపయ్య, బలిజగూడ సర్పంచ్ మాధవి నవీన్ కుమార్, మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామి, మాజీ అధ్యక్షులు బండి గారి విష్ణు గౌడ్, వార్డ్ సభ్యులు ఉప్పు శ్రీకాంత్, మేడి జానీ, పార్టీ అధ్యక్షులు ఉప్పు రజినీకాంత్, సిద్దాల సత్యనారాయణ, ఉప్పు శివ తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యమే మన సంస్కృతి మధుయాష్కి గౌడ్

**హయత్‌నగర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మధుయాష్కి గౌడ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హిందూ, ముస్లింలు కలిసి మెలిసి ఉండడమే మన సంస్కృతి అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. హయత్‌నగర్ శివాజీ కాలనీలోని వక్ఫ్ బోర్డు స్థలంలో మైనారిటీ నాయకులు సల్మాన్, సాజిద్, జిలాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాను పుట్టి పెరిగిన హయత్‌నగర్‌లో చిన్ననాటి నుంచి పండుగలను సోదరభావంతో కలిసి జరుపుకునే సంప్రదాయం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య విభేదాలు పెంచి రాజకీయ లబ్ధి పొందుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ కూడా బీజేపీకి మద్దతుగా ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మైనారిటీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వక్ఫ్ బోర్డు స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించి, అక్కడ ఫంక్షన్ హాల్ నిర్మించాలని మైనారిటీ సోదరులు కోరగా, సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మధుయాష్కి గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, దేవాలయ కమిటీ డైరెక్టర్ నరేష్, నాయకులు గణేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కొండూరు శ్రీనివాస్, బాబా యాదవ్, ఖదీర్, ఖాజా, ఎల్‌బీనగర్ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ షాకీర్, రిజ్వాన్, సుధాకర్ గౌడ్, చంద్రకాంత్, ప్రకాష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట కార్పొరేట్ ఫ్యాక్టరీల్లో కార్మికుల సంక్షేమ నిర్లక్ష్యం

- సిఎస్ఆర్ నిధులపై సందేహాలు
- కాలుష్యంపై ఆందోళనలు
- రక్షణ పరికరాలు లేక ప్రమాదకర రసాయనాల్లో పని చేస్తున్న సిబ్బంది
- వైద్య పరీక్షలు లేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆరోపణలు
- ప్రమాదాలు జరిగినా దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శలు



**అశ్వారావుపేట, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు కార్పొరేట్ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి రోజురోజుకు ఆందోళనకరంగా మారుతోంది. కొంతమంది కార్మికులు 20 ఏళ్లుగా నిరంతరం పనిచేస్తున్నప్పటికీ, వారి పరిస్థితిలో మార్పు లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కార్మికులు తీవ్ర శ్రమ చేస్తున్నప్పటికీ,కార్మిక చట్టాల ప్రకారం నెలకు 20-30 వేల రూపాయల జీతం కూడా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదకర రసాయనాల మధ్య పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, నియమిత వైద్య పరీక్షలు అందించడం లేదని కార్మికులు వాపోతున్నారు. అనారోగ్యానికి గురైన సందర్భాల్లో ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోకపోవడం, ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని బయటికి రానీయకుండా దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. బాయిలర్లు, రసాయన విభాగాల్లో పనిచేసే కార్మికులు ఎప్పటికప్పుడు ప్రమాద భయం మధ్యే విధులు నిర్వర్తిస్తున్నారని తెలుస్తోంది.ఇక కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) నిధుల విషయంలో మరింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.సి ఎస్సార్ నిధులు విడుదల అవ్వడం లేదని, అవి విడుదల అయినా ఎక్కడ ఖర్చవుతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది అని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక అభివృద్ధి, విద్య, ఆరోగ్య రంగాల్లో ఈ నిధులు ఉపయోగపడాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా స్పష్టమైన పనులు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. అదే సమయంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో వివిధ పథకాలు అమలు చేయాల్సి ఉన్న అశ్వారావుపేట మున్సిపాలిటీ కాలుష్య కోరలలో మునిగిపోతున్నప్పటికీ, అమలు స్థాయిలో తీసుకుంటున్న చర్యలు శూన్యమనే విమర్శలు ఉన్నాయి. ఇంకా కార్పొరేట్ ఫ్యాక్టరీలు కోట్లు కోట్లు లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ, కార్మికుల కష్టం ఎటు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తమ శ్రమతో సంస్థలు ఎదుగుతున్నప్పటికీ, తమ కుటుంబాల అభివృద్ధి కోసం ఏ చర్యలు తీసుకుంటున్నారో కూడా తెలియదని కొందరు కార్మికులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.పర్యావరణ పరిరక్షణ విషయంలో కూడా ఫ్యాక్టరీలపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలుష్య కారకమైన వ్యర్థ జలాలను శుద్ధి చేసి తిరిగి ఉపయోగించే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడం లేదని, అవి సరైన విధంగా నిర్వహించకపోవడం వల్ల చుట్టు పక్కల ప్రాంతాలు కాలుష్యానికి గురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఈ కాలుష్య ప్రభావంతో సమీప గ్రామాల్లో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆరోపిస్తున్నారు. తాగునీరు, గాలి కాలుష్యం కారణంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కాలుష్య కోరల్లో చిక్కుకున్న అశ్వారావుపేట ప్రజలు తమకు ఈ కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలని, పట్టణాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇక సహించదు తెలంగాణ.. బీజేపీ భారీ నిరసన




**జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కు వినతి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హయత్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి కలిసి జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన వంటి అంశాలలో స్పష్టత లేకపోవడం ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ లబ్ధిదారులు నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పేదల కోసం నిర్మించాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఆలస్యం అవుతున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని, ప్రచారం చేసిన 6 గ్యారంటీలు కేవలం హామీలుగానే మిగిలిపోయాయని అన్నారు. అదేవిధంగా హయత్ నగర్ పరిధిలో రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, ప్రాథమిక సదుపాయాల లోపం రోజురోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పత్రంలో వివరించారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ తరపున మరింత ఉద్ధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బి యన్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి తో పాటు బీజేపీ హయత్ నగర్, వనస్థలిపురం, బి.ఎన్. రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ల అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కటకం క్రాంతి, హరీష్, విష్ణు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, బీజేవైఎం మోర్చాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వెదురు హస్తకళల శిక్షణ కార్యక్రమం ముగింపు



**రాజేంద్రనగర్, విశాలభారతి :**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని సామాజిక విజ్ఞాన కళాశాల ఆధ్వర్యంలో, వనరుల నిర్వహణ మరియు వినియోగదారుల శాస్త్ర విభాగం సంయుక్తంగా వెదురుతో హస్తకళల తయారీ మరియు అటవీయేతర ఉత్పత్తుల ప్రాసెసింగ్‌పై నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని 13032026 నుండి ఆరు రోజులపాటు నిర్వహించింది. ఈ శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశం ఈరోజు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ వి. విజయలక్ష్మి, భారతీనగర్ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి, సురక్ష సేవా సంఘం అధ్యక్షుడు కే. గోపి శంకర్ యాదవ్, ప్రెసిడెంట్ ప్రశాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి సిహెచ్. స్నేహలత (ఈ ప్రోగ్రామ్‌కు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్), శిక్షకుడు మహమ్మద్ మజార్, హారతి, తులసి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. విజయలక్ష్మి మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న ల్యాంప్ షేడ్లు మరియు లాండ్రీ బాస్కెట్లు తయారు చేసి వాటిని విక్రయించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. భారతీనగర్ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల కోసం నిర్మించిన ఈ ట్రైనింగ్ హాల్‌లో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగకరమైందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం సంగారెడ్డి జిల్లా, బిహెచ్ఇఎల్ పరిధిలోని ఎల్ఐజి కాలనీ ట్రైనింగ్ సెంటర్, భారతీనగర్ వార్డ్ కార్యాలయంలో నిర్వహించబడింది. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర విజ్ఞాన మరియు సాంకేతిక మండలి (టీజీ కాస్ట్), తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది.

## ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ కా తోఫా" కిట్లు



**విశాలభారతి , కరక గూడెం:**

తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పండుగ కానుకగా ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ కా తోఫాలను అందజేస్తోంది. ఈ సందర్భంగా ఈరోజు కరకగూడెం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో 75 ఈద్ కా తోఫా కిట్లను ముస్లిం సోదర సోదరీమణుల కోసం ముస్లిం పెద్దలకు అందజేసిన ఎం ర్ ఓ వట్టం కాంతయ్య మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అనంతరం వారు మాట్లాడుతూ,రంజాన్ మాసం అనేది కేవలం ఉపవాసాల కాలం మాత్రమే కాదు ఇది శాంతి సేవ సహనం మరియు మానవత్వాన్ని పెంపొందించే పవిత్ర సమయం అని, ఈ నెలలో మనం ఆకలి విలువను తెలుసుకుంటాం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలనే మనసును పెంచుకుంటాం అని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ముస్లిం సోదర సోదరీమణుల పండుగలను గౌరవిస్తూ, వారి ఆనందంలో భాగస్వామ్యం అవుతుందనీ ,అందుకే రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ కా తోఫా కిట్లను అందజేస్తూ, ప్రతి కుటుంబంలో సంతోషం నిండాలని ఆకాంక్షిస్తుందని అన్నారు. అలాగే ముందుగా పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ముస్లిం పెద్దలు సజ్జాద్ హుస్సేన్ , పఠాన్ యాకూబ్ ,పఠాన్ అక్బర్ ,అబ్దుల్లా , సలీం ,మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు..

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ కౌన్సిలర్




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి

కుంట్లూర్ డివిజన్ భూదాన్ కాలనీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జీఎస్ సేవా సమితి చైర్మన్, మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్యారల శ్రీనివాస్ గౌడ్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపవాస దీక్షలో ఉన్నవారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొంటూ ముస్లిం సోదరులను అభినందించారు. మతసామరస్యం, ఐకమత్యం సమాజానికి బలమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కుంట్లూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం నాయకులు షైక్ లాల్ మహ్మద్,ముస్లిం సోదరులు, స్థానిక ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

**బుర్ర శ్రీనివాస్ గౌడ్**



**ముషీరాబాద్, విశాలభారతి:** నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభ పరిణామమని తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు.వివాహ సంబంధాల సంస్థలను ఏర్పాటు చేసి సంబంధాలను కుదిరిచ్చి జంటలను చేయడంలో మహిళల పాత్ర చాలా గొప్పదన్నారు. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ కమిషన్ మెంబర్ బాల లక్ష్మీ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, గోప ప్రెసిడెంట్ బండి సాయన్న గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, సామ స్వరూప గౌడ్, మామిండ్ల మాధవి, చండి శ్రీనివాస్ గౌడ్ హాజరై వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఒకప్పుడు వంటింటికి పరిమితమై గడప దాటని మహిళలు నేడు ఆకాశ మార్గాన ప్రయాణించి శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. మహిళలను తక్కువ అంచనా వేయొద్దని అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వివాహ సంబంధాలను కలపడంలో మధ్యవర్తిగా ఉంటూ ఎంతో సేవ చేస్తున్నారని చెప్పారు. పెళ్లి అనేది ఒక కళ అని అటువంటిది ఇరు వర్గాలను ఒప్పించి పెండ్లి వరకు తీసుకువచ్చేందుకు మ్యారేజ్ బ్యూరోలు ఎంతో కష్టపడతారని తెలిపారు. ఎటువంటి ఫలితం ఆశించకుండా జంటలను ఒకటి చేయడంలో మహిళలు ప్రముఖంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పన్యాల మమతా గౌడ్, మహేశ్వరి గౌడ్, ఈశ్వర్ నేత, హరీష్ కుమార్, భాగ్యలక్ష్మి, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## చిలుకూరు బాలాజీ నీ దర్శించుకున రిటైర్డ్ ఐఏఎస్



**మొయినాబాద్, విశాలభారతి:** రిటైర్డ్ ఐ ఏ ఎస్ అధికారి మరియు హెచ్ ఓ పి పి చైర్మన్ దాసరి శ్రీనివాసులు ఈ రోజు చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని సందర్శించి శ్రీ బాలాజీ స్వామివారి దర్శనం ముగించుకొని.

అనంతరం సి.ఎస్. రంగరాజన్‌ను కలిసి, పరమపూజ్యులైన డా. ఎం.వి. సౌందరరాజన్ మరణం పై సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ డా. సౌందరరాజన్ ఆచార సంప్రదాయాల పరిరక్షణలో, చిలుకూరు దేవాలయానికి ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన సేవలు దేవాలయ విశిష్టతను కాపాడడమే కాక భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాయని అన్నారు.డా. సౌందరరాజన్ జీవితం సేవ, సంస్కృతి, భక్తికి ప్రతీక. ఆయన లోటు భర్తీ చేయలేనిది అని శ్రీనివాసులు భావోద్వేగంతో తన కుటుంబ సభ్యులకు తన హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారికి ధైర్యం కలగాలని శ్రీ బాలాజీ స్వామివారిని ప్రార్థించారు.

## డిప్యూటీ తహసిల్దార్‌కి బీజేపీ వినతి పత్రం

**బీజేపీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి.**

**మొయినాబాద్ , విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, మండల పరిధిలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు మండల రెవెన్యూ అధికారికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా వంటి పథకాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. మండలంలో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందకపోవడంతో అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అలాగే అర్హులైన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఆసరా పెన్షన్లు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరులో ఆలస్యం జరుగుతోందని, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో సమర్పించిన దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. వీటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు, వీధి దీపాల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా నివాస, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని, అర్హులకు సమయానికి పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాష్ సన్ వల్లి ప్రభాకర్ రెడ్డి మోర నర్సింహారెడ్డి మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అత్తాపూర్ శ్రీనివాస్ గౌడ్ బంటు జ్ఞానేశ్వర్ మధుసూదన్ రెడ్డి ఏరుపుల మహిపాల్ ప్రభాకర్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి రాజ మల్లేష్ రాయనోళ్ళ రవిందర్ యాదవ్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు





# మైసా.. వేట మొదలైంది!

అగ్ర తారలు విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ఇటీవలే వివాహబంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి పెళ్లి వేడుక వైభవంగా జరిగింది. దాదాపు రెండు వారాల పాటు వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో బిజీగా ఉన్న రష్మిక మందన్న తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టింది. తాజాగా ఆమె పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' షూటింగ్‌లో జాయిన్ అయ్యింది. ఈ సినిమాలో రష్మిక మందన్న గోండు తెగకు చెందిన యోధురాలి పాత్రలో కనిపించనుంది. కెరీర్‌లో తొలిసారి రష్మిక మందన్న ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌ని చేస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం షూట్‌లో భాగంగా ఆమెపై యాక్షన్ సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ స్టంట్ మాస్టర్ ఆండీలాంగ్ నేతృత్వంలో ఈ ఎపిసోడ్‌ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. 'మైసా' చిత్రీకరణ తాలూకు ఫొటోను అభిమానులతో పంచుకుంది రష్మిక మందన్న. దీనికి 'వేట మొదలైంది' అనే క్యాప్షన్‌ను జత చేసింది. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.